# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 50 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-


published : Amalapuram Vol:10 Issue : 50 11-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## తెలంగాణకి భూకంపం ముప్పు


హైదరాబాద్ ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలంగాణకు భూకంప హెచ్చరిక భయాందోళనకు గురిచేస్తోంది. రామగుండంలో భూకంపం వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూకంప తీవ్రత గట్టిగా ఉంటుందని చెబుతున్నారు. ఆ

- తరువాయి 2లో..



## కృత్రిమ మేధతో...
# రాష్ట్ర ఆదాయం పెంచండి



### సచివాలయంలో ఆదాయార్జన శాఖల అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సీఎం చంద్రబాబు రాష్ట్ర ఆదాయం పెంచే అంశంపై ఫోకస్ పెట్టారు. పన్ను ఎగవేతలకు ఏఐతో చెక్ పెట్టాలని అధికారులకు సూచించారు. పన్నుల వసూళ్లలో టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. పన్నుల వసూళ్లు పెరిగేలా ఆదాయార్జన శాఖలన్నీ పనిచేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఆదాయార్జన శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మరిన్ని ఆదాయ మార్గాలను వెతకడంతో పాటు, ఎక్కడ ఆదాయం తక్కువగా నమోదవుతుందో దానికి గల కారణాలను వెతికి చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. పన్నుల చెల్లింపుల దగ్గర నుంచి రశీదులు, నోటీసులు జారీ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరగాలని చెప్పారు.మున్సిపల్ శాఖ ఇచ్చిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా బిల్డర్లు

- తరువాయి 2లో..

## ఏపీలో రేషన్‌దారులకు..
## జూన్ నుంచి
# రాగులు పంపిణీ

### రెండు కేజీలు రాగులు

అమరావతి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండితో పాటుగా తృణధాన్యాలను కూడా పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే జూన్ నెల నుంచి రేషన్‌కార్డులు ఉన్నవారికి రాగులు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతుండగా.. ఈ మేరకు అవసరమైన సన్నాహాలు చేస్తోంది. రేషన్‌కార్డులు ఉన్నవారు రేషన్ బియ్యానికి బదులుగా రాగులు ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

ప్రతినెలా 20 కిలోల బియ్యం తీసుకునే కుటుంబం రెండు కేజీలు రాగులు కావాలనుకుంటే.. ఆ మేరకు ఇచ్చే బియ్యాన్ని మినహాయించేలా ప్లాన్ చేశారు అధికారులు. అయితే ఏడాదికి దాదాపు 25 వేల మెట్రిక్ టన్నుల రాగులు అవసరమవుతాయని పౌరసరఫరాల

- తరువాయి 2లో..



## రాజకీయాలలో గెలుపు, ఓటములు
# సహజం

### ప్రజా సమస్యలపై పోరాడదాం
### కర్నూలు నేతలతో వైసీపీ అధినేత జగన్



అమరావతి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

"రాజకీయాలలో గెలుపు, ఓటములు సహజం.. ఏది ఏమైనా ప్రజల పక్షాన నిలిచి పని చేద్దాం.. ప్రజా సమస్యలపై

- తరువాయి 2లో..

## పవన్ కల్యాణ్ "అడవి తల్లి బాట"పై
# వీడియో రిలీజ్..



అమరావతి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల చేపట్టిన 'అడవి తల్లి బాట' కార్యక్రమంపై జనసేన పార్టీ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. గిరిజనులతో పవన్ మమేకం అవడం, వాళ్లతో కలిసి నృత్యం చేయడాన్ని వీడియోలో చూపించారు. మూడు రోజుల క్రితం అల్లూరి సీతారామరాజు జిల్లాలో అడవి తల్లి

- తరువాయి 2లో..

## ఐటీ కంపెనీలు, హైటెక్ సిటీని చూసినప్పుడు
# చంద్రబాబే గుర్తుకు వస్తారు

### రూ. 2కే బియ్యం అంటే ఎన్టీఆర్, రైతు బాంధవుడు అంటే వైఎస్సార్ గుర్తుకొస్తారు..
### అలాగే యంగ్ ఇండియా తన బ్రాండ్ అన్న రేవంత్ రెడ్డి
### పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ ముఖ్యమైందన్న రేవంత్ రెడ్డి

అమరావతి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఐటీ కంపెనీలు, హైటెక్ సిటీని చూసినప్పుడు నారా చంద్రబాబునాయుడు గుర్తుకు వస్తారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మొట్టమొదటిసారి రూ. 2కే ఎన్టీఆర్ బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారని, దానిని తీసుకున్న ప్రతి పేదవాడు ఆయనను గుర్తు చేసుకుంటారని అన్నారు. జలయజ్ఞం, రైతుబాంధవుడుగా వైఎస్సార్ ప్రజల మదిలో నిలిచిపోతారని అన్నారు. తన బ్రాండ్ యంగ్ ఇండియా అని ఆయన స్పష్టం చేశారు. విశ్లేషకులు, విమర్శకులు, ప్రజలకు తాను ఒక్కటే చెప్పదలుచుకున్నానని, యంగ్ ఇండియానే తన బ్రాండ్ అని ఆయన అన్నారు. ఎలాంటి బ్రాండ్ లేకుండా, గుర్తింపు లేని ముఖ్యమంత్రిగా ఉంటారా అని కొందరు తనను ప్రశ్నిస్తున్నారని, దానికి సమాధానంగా యంగ్ ఇండియా తన బ్రాండ్ అని చెబుతున్నానని అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో ఆయన యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ ఎంతో ముఖ్యమైనదని అన్నారు. పోలీసు శాఖపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని అన్నారు. కేజీ టు పీజీ వరకు నిధుల విషయంలో ఎలాంటి ఆటంకాలు ఉండవని హామీ ఇచ్చారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూలుకు రూ. 100 కోట్లతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిధుల విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.



## ఏపీలో అతిపెద్ద కెరీర్ ఫెయిర్..
# 49 టాప్ కంపెనీలు..
# 10,000+ ఉద్యోగాలు

అమరావతి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీలో నిరుద్యోగులకు మంత్రి నారా లోకేశ్ గుడ్‌న్యూస్ చెప్పారు. విశాఖలోని గీతం వర్సిటీ వేదికగా నిర్వహించే అతిపెద్ద కెరీర్ ఫెయిర్‌లో భాగస్వాములు

2 లో..



## ఒంటిమిట్టలో
# సందడి..

### నేడు రామయ్య కళ్యాణం

కడప, ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఒంటిమిట్టలో రమణీయంగా కోదండరామయ్య వార్షిక బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి.. ఐదవ రోజు ఉదయం మోహిని అలంకారంలో సీతారామ లక్ష్మణులు విహరించారు.. స్వామి అమ్మవార్లకు పుష్ప మాలికలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు పండితులు.. మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో కోలాహలంగా జగదభి రామయ్య వాహన సేవ నిర్వహించారు..

- తరువాయి 2లో..

## పవన్ అనుకోకుండా డిప్యూటీ సీఎం అయ్యారు: కవిత

అమరావతి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ అనుకోకుండా డిప్యూటీ ముఖ్యమంత్రి అయ్యాడని%ా% సెటైర్లు పేల్చారు. పవన్ కళ్యాణ్ సీరియస్ పొలిటీషియన్ కాదని ఆమె వెల్లడించారు. తాజాగా మీడియాతో మాట్లాడిన కల్వకుంట్ల కవిత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు హిందీ నేర్చుకోవాలన్న పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై స్పందించడమేంటని యాంకర్ అడిగిన ప్రశ్నకు

- తరువాయి 2లో..



తెలుగురాష్ట్రం దినపత్రిక

# కలెక్షన్స్ లేకపోతే ఏమీ చేయలేం..



## ఏపీ మున్సిపల్ కమిషనర్ల ఒకరోజు వర్క్ షాపు..

## వర్క్ షాప్ కు హాజరైన మంత్రి నారాయణ..

**అమరావతి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీ మున్సిపల్ కమిషనర్ల ఒకరోజు వర్క్ షాపు విజయవాడలో జరుగుతోంది.. వర్క్ షాప్ కు హాజరైన మంత్రి నారాయణ మాట్లాడుతూ మునిసిపల్ కమిషనర్లు రెవెన్యూ పై దృష్టిపెట్టాలని అన్నారు.. అలాగే కలెక్షన్లు లేకపోతే ఏమీ చేయలేం అన్నారు.. ఏ మునిసిపాలిటీ కలెక్షన్ ఆ మునిసిపాలిటీలోనే వినియోగించుకునేలా అవకాశం ఇచ్చారు.. వచ్చే మార్చి నాటికి 80 శాతానికి పైగా కలెక్షన్లు జరిగిపోవాలన్నారు.. కుక్కల స్టెరిలైజేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. మునిసిపాలిటీలు స్వయం పరిపాలన చేయాలి.. కలెక్షన్లు లేనిదే మనం ఏమీ చేయలేం.. 2014-19 మధ్యలో అండర్ అసెస్మెంట్లు రెగ్యులరైజ్ చేయలేదు.. అప్పట్లో రాష్ట్ర ఖజానా బాగానే ఉండేది%శా% ప్రతీ వారం కలెక్షన్ గురించి నేను అడుగుతూనే ఉంటాను.. ట్యాక్స్‌లు కట్టకపోతే కరెంటు కట్ చేస్తామని స్పష్టం చే శారు.. స్వచ్ఛ ఆంధ్ర, మునిసిపాలిటీలు 50-50 విధానంలో మెషీన్లు కొనాలి.. రాబోయే రోజుల్లో అంతా మెకనైజ్డ్ విధానాలే రాబోయే రెండేళ్ళలో మునిసిపల్ బిల్డింగ్ లు కట్టే ఆలోచన లేదన్నారు మంత్రి నారాయణ.. చాలాకాలంగా ఉండిపోయిన చెత్త అక్టోబర్ 2 నాటికి లేకుండా చేయాలి.. AAB, AMRUTH లు కూడా జరగాలి అన్నారు.. కుక్కలకు వేక్సినేషన్ పూర్తిస్థాయిలో జరగాలి.. గుంటూరులో చిన్న పిల్లాడి మరణం చాలా దారుణం.. కుక్కల స్టెరిలైజేషన్ అనేది ప్రధాన అంశంగా మీరు పూర్తి చేయాలి.. వేసవి నీటి ఎద్దడి కష్టం రాకుండా అందరూ చూడాలి%శా% బిందెలు పట్టుకుని మహిళలు రోడ్ల మీదకు రాకుండా చూడాలి అని ఆదేశించారు మంత్రి నారాయణ.. క, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ.. వచ్చే సంవత్సరంలో మునిసిపల్ కమీషనర్లు ఏం చేయాలి అనేది ఇవాళ వర్క్ షాప్ లో ఇవ్వడం జరుగుతుంది.. ఇవాళ ఇచ్చే విధానాల ఆధారంగా మునిసిపల్ కమీషనర్ల రివ్యూ జరుగుతుంది.. నగర జనాభా ఎప్పటికప్పుడు పెరుగుతుంది .. ఆస్థిపన్ను వసూలు చేయడం ప్రధాన టార్గెట్‌గా ఉండాలన్నారు.. వసూలు చేసిన ఆస్థిపన్ను ఆయా మునిసిపాలిటీలే వినియోగించుకోవచ్చు.. మార్చి 30 నాటికి 80% పైగా రెవెన్యూ కలెక్షన్ ఉండాలి అని స్పష్టం చేశారు..

# సంపాదకీయం

## ప్రాసంగికత కోల్పోతున్న యూరప్?

డోనాల్డ్ ట్రంప్, జె.డి. వాన్స్ కలిసి వైట్ హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ఎలా 'వేధించారో' ప్రపంచం అంతా చూసింది. అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆయన పట్ల పాశవికంగా ప్రవర్తించి గుడ్ బై సైతం చెప్పకుండా తరిమేశారు. 'రష్యాను ధిక్కరించండి, మీకు మేము అండగా ఉన్నాం...' అంటూ ఉక్రెయిన్ అధినేతకు బాసటగా నిలిచి ఎంతగా ప్రోత్సహించాలో అంతగా ప్రోత్సహించిన యూరప్ ఈ ఘట్టాన్ని చేష్టలుడిగి చూసింది. యూరప్ ప్రభావం పలుచబడిపోతోంది అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?

**తగ్గుతున్న జనాభా**

యూరోపియన్ యూనియన్ (ఈయూ)కు బలమైన నాయ కత్వం లేదు. ఎవరి దౌత్య విధానం వారిదే. 'యూరప్‌తో మాట్లాడా లనుకుంటే, నేను ఎవరికి ఫోన్ చేయాలి?' అంటూ అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హెన్రీ కిసింజర్ ఒక సందర్భంలో చేసిన సుప్రసిద్ధ వ్యాఖ్య ఇందుకు అద్దం పడుతుంది. యూరప్ దేశాలకు కాలం కూడా కలిసిరావడం లేదు. ఆ దేశాల్లో జననాల రేట్లు తగ్గుతున్నాయి. వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా, యువకులు తగ్గిపోతున్నారు. 2050 నాటికి యూరప్ సగటు వయసు 48 ఏళ్లకు పెరుగుతుంది. 60 ఏళ్లు దాటినవారు జనాభాలో 40 శాతం ఉంటారు. వందేళ్ల క్రితం ప్రపంచ జనాభాలో 25 శాతం యూరప్ దేశాల ప్రజలే ఉండేవారు. 2050 నాటికి, వీరి వాటా కేవలం 7 శాతానికి పరిమితం అవుతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. యుద్ధరంగానికి దళాలను సమకూర్చుకోవడం కూడా ఈ దేశాలకు సమస్యగా మారుతోంది. రష్యా ఇప్పటికే ఉత్తర కొరియా దళాలను రెగ్యులర్ ప్రాతిపదికన తన సైన్యంలో నియమించుకోవలసి వచ్చింది. పనిచేసే వారి సంఖ్య తగ్గిపోతున్నా సరే... యూరప్ కాలం చెల్లిన తన పాత ఇమ్మిగ్రేషన్ విధానాలనే పట్టుకు వేలాడుతోంది. ఇది శ్రమశక్తి సమస్యను మరింత జటిలం చేస్తోంది. ఉక్రెయిన్ శ్వేతజాతి శరణార్థుల పుణ్యమా అని పనిచేసే వారి సంఖ్య పెరిగినా ఇది తాత్కాలికమే!

**ఎదుగుదల లేని ఆర్థిక వ్యవస్థ**

పరిపాలన సరిగా ఉండదు, ఆర్థికంగా పురోగమనం లేదు, వయసు మళ్లుతున్న జనం పెరుగుతున్నారు, వృత్తిపరమైన అవకా శాలూ అంతంత మాత్రమే. ఇలాంటి యూరప్ ఇండియాను ఎలా ఆకట్టుకుంటుంది? అమెరికాలో ఒంటి రంగును బట్టి కాకుండా, సత్తాను బట్టి మనుషుల్ని అంచనా వేస్తారు. ఆ మాదిరిగా మార్పు చెందటంలో యూరప్ సమాజం విఫలమైంది. నత్తనడకగా ఉన్న జీడీపీ వృద్ధి రేటు, పెరుగుతున్న సామాజిక భద్రతా వ్యయాలు, నడ్డి విరుస్తున్న రుణభారం... ఇవన్నీ ఆ ఖండం ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి. అమెరికా పాత్రికేయుడు ఫరీద్ జకారియా చెప్పినట్లు, యూరప్ దుస్థితికి మూల కారణం ఆర్థిక వృద్ధి లోపం. ఉదాహరణకు ఇటలీ ఆర్థిక వ్యవస్థలో ఏకంగా ఒక దశాబ్దంగా ఎలాంటి పెరుగుదల లేదు. ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాల్లోని వర్ధమాన ఆర్థిక వ్యవస్థలు బలం పుంజుకుంటూ దూసుకు వస్తున్నాయి. గ్లోబల్ గవర్నెన్స్‌లో తమకు అధిక పాత్ర ఉండాలని ఈ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి, జీ%-%7, నాటో వంటి ప్రపంచ అధికార సంస్థలు ఇప్పటికీ యూరప్ చెప్పుచేతల్లో నడుస్తున్నాయి. కానీ ఆర్థిక వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రస్తుతం అయిదు యూరప్ దేశాలు (జర్మనీ, యూకే, రష్యా, ఫ్రాన్స్, ఇటలీ) ప్రపంచ టాప్%-%10 ఆర్థిక వ్యవస్థల్లో ఉన్నాయి. 2050 నాటికి ఈ అయిదింటిలో కేవలం జర్మనీ, యూకే రెండే టాప్%-%10 జాబితాలో మిగిలి ఉంటాయి. ఆ పదిలో వాటికి దక్కే ర్యాంకులు చిట్టచివరి తొమ్మిది, పది! ఇందుకు భిన్నంగా, వాటి కంటే ముందుండే ఇండియా, బ్రెజిల్, ఇంకా ఇతర వర్ధమాన దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో తమకు గణనీయ పాత్ర ఉండాలని ఒత్తిడి చేస్తాయి. ఇప్పటి ప్రపంచ వ్యవస్థ పునర్ వ్యవస్థీకరణను ఎంతో కాలం అడ్డుకోలేరు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి నిర్మాణం ఇప్పటికే కాలం చెల్లిపోయింది. దీన్ని ఎలా పునర్ వ్యవస్థీకరించాలనే అంశంపై పరిశీలన జరుగుతోంది. ఇండియా, బ్రెజిల్, జర్మనీ, జపాన్ వంటి దేశాలు ప్రస్తుత సభ్యత్వాల మీద అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. తమకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని ఒత్తిడి తెస్తున్నాయి. ఇండియా జీడీపీలో మూడోవంతు కంటే తక్కువ, జపాన్ జీడీపీలో దాదాపు సగం ఉండే యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలు శాశ్వత సభ్యు లుగా ఉండటం... ఇండియా, జపాన్ వెలుపల ఉండటం ఎలా సమంజసమనీ, వాటి మీద ఈ రెండు యూరప్ దేశాలు ఎలా పెత్తనం చలా యిస్తాయనీ గట్టి వాదన వినబడుతోంది. భద్రతా మండలి, జీ%-%7 లను సభ్యత్వ పరంగా విస్తరించడం మీద చర్చలు నడుస్తున్నాయి. ప్రపంచ పాలన సంస్థల పునర్ వ్యవస్థీకరణ జరగాలన్నది కాదనలేని అంశం.

**తిరుగులేని అమెరికా?**

శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా ఉన్న అమెరికా ముమ్మందు కూడా ప్రబలమైన ప్రపంచ శక్తిగా కొనసాగుతుంది. చైనా, ఇండియా వంటి దేశాలు దాన్ని వెన్నంటి ఉంటాయి. ఒకవేళ అధిగమించినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు. ఏమైనా, రెండో ప్రపంచ యుద్ధం ముగిసి వందేళ్లు గడిచే లోపే అప్పటి విజేతల్లో ఒక్క అమెరికా మినహా మిగిలినవన్నీ టాప్%-%10 జాబితా నుంచి కను మరుగవుతాయి. అమెరికా లోలోపల పలు మార్పులు చెందుతోంది. జనాభా వర్గాల్లో పరివర్తన ఫలితంగా రాజకీయంగానూ మార్పులు సంభవి స్తున్నాయి. నల్ల జాతీయుడిని అధ్యక్షుడిగా ఎన్నుకుంది. ఆఫ్రో%-%ఇండి యన్ మహిళ ఉపాధ్యక్ష పదవిని చేపట్టగలిగింది. భారతీయ అమెరికన్లు ప్రభుత్వంలో, విద్యా పారిశ్రామిక రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎగబాకారు. గుజ్జూభాయి కశ్యప్ పటేల్ ఎఫ్‌బీఐ పగ్గాలు చేపడతాడని ఎప్పుడైనా అనుకున్నామా? వివిధ దేశాల సంతతులకు చెందిన వ్యక్తులు ప్రభుత్వ, ఇతర రంగాల్లో ప్రముఖ స్థానాలు పొందడం వల్ల ఆ యా దేశాలు అమెరికాతో సాన్నిహిత్యం పెంచుకుంటున్నాయి. విదేశీయులకు ప్రవేశం కల్పించడం వల్ల అమెరికా ప్రతిభ ఇనుమడించింది. యూరప్ ఈ విషయంలో విఫలమైంది. వర్ధమాన దేశాలు 21వ శతాబ్దపు నూతన వ్యవస్థకు రూపు దిద్దబోతున్నందున... ప్రపంచ వ్యవహారాల్లో యూరప్ పాత్ర క్రమేపీ క్షీణించిపోతుంది. యూరప్ గనుక జనాభా సంబంధిత (డెమో గ్రాఫిక్) నూతన విధానాలు రూపొందించకపోతే, ఆర్థిక పరమైన సంస్కరణలు చేపట్టకపోతే అది ఈ బహుళ ధ్రువ ప్రపంచంలో గుర్తింపు లేని ఖండంగా మిగిలిపోతుంది. రానున్న రోజుల్లో ఆసియానే ప్రపంచ అధికార కేంద్రంగా ఆవి ర్భవిస్తుంది. 2020లో ఈ ఒక్క ఖండమే ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో 60 శాతం వాటా కైవసం చేసుకుంది. ఇదే ట్రెండ్ ఇక మీదటా కొనసాగబోతోంది. చైనా, ఇండియా ఆర్థిక, రాజకీయ రంగాల్లో తమ పలుకుబడి పెంచుకుంటూ పోయి, ప్రపంచ పాలన (గ్లోబల్ గవర్నెన్స్)లో మార్పుల కోసం పట్టుబడతాయి. అయితే, అమెరికాతో విరోధం కారణంగా చైనా, యురోపియన్ యూనియన్ (ఈయూ)కు చేరువయ్యే అవకాశం ఉంది. ఇక చైనాతో సంబంధాలు బెడిసినందువల్ల ఇండియా, అమెరికాకు బహుశా మరింత దగ్గర అవుతుంది.

## కృత్రిమ మేధతో... రాష్ట్ర ఆదాయం పెంచండి

అసలు రిజిస్టర్ కాలేదని ఏఐ గుర్తించిందని, జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే ప్రభుత్వం ఎటువంటి ఆమోదాలైనా తెలపాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. పన్ను ఎగవేతదారులను పసిగట్టేందుకు ఏఐని వినియోగించుకోవాలని ఆదేశించారు. అన్ని ఆదాయార్జన శాఖల్లోనూ ఇదే తరహా ప్రక్రియ అమలు చేసి పకడ్బందీగా పన్ను వసూళ్లు చేయాలని చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా వ్యాపారులకు పన్ను చెల్లింపులు, అనుమతులు వంటివి సులభతరం అవుతున్నాయనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. పన్నుచెల్లింపుదారులు, జీఎస్టీ పోర్టల్, ఏపీ రాష్ట్ర డేటా సెంటర్, ఏపీసీటీడీ ఇలా మొత్తం శాఖల సమాచారాన్ని ఏఐతో అనుసంధానించాలని చేయాలని అధికారులకు సూచించారు.

**మొబైల్ నెంబర్**

ప్రజా ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో మరింత వేగంగా స్పందించాలని, ఎప్పటికప్పుడు దరఖాస్తుదారులకు గ్రీవెన్స్ స్థితిని తెలియజేసే సమాచారం అందించాలని, ఇందుకోసం ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పరిష్కరించగలిగే వినతులను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించాలని చెప్పారు. అలాగే పరిష్కరించలేని వినతుల విషయంలో ఫిర్యాదుదారులకు ఎందుకు పరిష్కరించలేకపోతున్నామనే విషయాన్ని వివరంగా తెలియజేయాలని సూచించారు. గ్రీవెన్స్‌ల పరిష్కారంపై మంగళవారం సచివాలయంలో ప్రత్యేకంగా సమీక్షించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఏఐని వినియోగించి**

ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రాష్ట్ర సొంత ఆదాయ లక్ష్యం రూ.1,37,412 కోట్లను 100 శాతం ఆర్జించేలా అన్ని శాఖలు కృషి చేయాలని అధికారులకు సూచించారు. పన్ను చెల్లింపుదారులకు నోటీసుల జారీకి, గ్రీవెన్స్‌లు స్వీకరించడానికి ఏఐని వినియోగించి ప్రభుత్వ యంత్రాంగంలో మరింత వేగం పెంచాలన్నారు. మున్సిపల్ శాఖలో 2023-24 కంటే 2024-25లో రూ.500 కోట్లకు పైగా ఆదాయం అదనంగా వచ్చిందని పన్నులకు సంబంధించి ఇంకా సుమారు రూ.2,500 కోట్ల బకాయిలు ఉన్నాయని అధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు.

## ఏపీలో అతిపెద్ద కెరీర్ ఫెయిర్..

### 49 టాప్ కంపెనీలు.. 10,000+ ఉద్యోగాలు

కావాలని కోరారు. 49 అగ్రశ్రేణి ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీల్లో 10,000ం ఉద్యోగావకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఈ కెరీర్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన గురువారం సాయంత్రం విడుదల చేశారు. ఏపీ ఉన్నత విద్యామండలి, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ ఈ మేళా నిర్వహిస్తోంది. మార్చి 5, 6 తేదీల్లో విశాఖలోని గీతం విశ్వవిద్యాలయం వేదికగా కెరీర్ ఫెయిర్ ఉంటుందని లోకేశ్ తెలిపారు. 2024, 2025 పాస్‌అవుట్ (టెక్, ఆర్ట్స్, సైన్స్, ఐటీఐ, పాలిటెక్నిక్ అండ్ డిప్లమా) విద్యార్థులు దీనికి అర్హులు. తొలుత వచ్చిన వారికి తొలి ప్రాధాన్యం ప్రాతిపదికగా ఈ కెరీర్ ఫెయిర్ సాగుతుంది. అభ్యర్థులు మార్చి 3లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ అవకాశాన్ని యువత మిస్ చేసుకోవద్దని లోకేశ్ సూచించారు.

## జూన్ నుంచి రాగులు పంపిణీ

వేశారు. ఈ మేరకు రాగులు సేకరించేందుకు తాజాగా టెండర్ నోటీసు జారీ చేసింది. జూన్ నెల నుంచి రాగుల్ని పంపిణీ చేసేందుకు ప్లాన్ చేశారు. ఏపీలో రేషన్ కార్డుదారులు ఉన్నవారికి ఈ నెలలోనూ కూడా కందిపప్పు అరకొరగా అందుతున్నాయి. ఈ నెల కూడా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

**ఈ నెలలో కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే**

గత రెండు మూడు నెలలుగా కందిపప్పు పంపిణీ నిలిచిపోగా.. మార్చిలో ఇస్తారని భావించారు. అయితే ఏప్రిల్‌లో అయినా కందిపప్పు ఇస్తారని లబ్ధిదారులు అనుకున్నారు. ఈ నెలా సరిపడా కందిపప్పు రాలేదని ఎండీయూ వాహనాల సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం బయట మార్కెట్లో కిలో కందిపప్పు రూ.160 నుంచి రూ.180 వరకు ధర పలుకుతోంది. ఈ నెలలోనూ కందిపప్పు ఇవ్వకపోవడంతో ఇబ్బందుల్లో ఉన్నారు. ఏప్రిల్ నెలకు కందిపప్పు సరఫరా కాలేదు. కందిపప్పును మే నెలలో వస్తుందని అంచనా వేస్తున్నారు. కందిపప్పు వచ్చే నెలలో సరఫరా అయితే లబ్ధిదారులకు పంపిణీ చేయిస్తామంటున్నా అధికారులు. ఈ నెలలో కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు.

## రాజకీయాలలో గెలుపు, ఓటములు సహజం

పోరాడదాం" అని వైసీపీ అధినేత, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక నేతలతో వైఎస్ జగన్ గురువారం నాడు తాడేపల్లిలోని తన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రాష్ట్రంలో ఇవాళ ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో చూస్తున్నాం. వైసీపీకి మొదటి బీజం కర్నూలు జిల్లా నల్లకాలువలోనే పడింది. కేవలం ఇచ్చిన మాటకోసం.. ఎందాకైనా వెళ్లాం. ఆ ప్రస్థానంలో వైసీపీ ఆవిర్భవించింది. బలమైన పార్టీగా వైసీపీ ఎదిగింది. ఆ రోజు నుంచీ నాతోనే మీరంతా అడుగులు వేశారు. పార్టీ పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ నాతోనే ఉన్నారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతే మన పార్టీ సిద్ధాంతం. విలువలకు, విశ్వసనీయతకు అర్థం చెప్పిన పార్టీ వైసీపీ. ఈ రెండు పదాలే పార్టీని నడిపించాయి. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజం. ఇవాల్టికీ కూడా పార్టీకి చెందిన ఏ నాయకుడైనా గర్వంగా కాలర్ ఎగరవేసుకుని ప్రజల వద్దకు వెళ్లగలడు. ప్రతి కుటుంబాన్ని చిరునవ్వుతో పలకరించి ఆశీస్సులు తీసుకునే కెపాసిటీ వైసీపీ నేతలకు మాత్రమే ఉంది" అన్నారు. "మనం రాక ముందు రాజకీయాలు ఒకలా ఉండేవి. మనం వచ్చిన తర్వాత రాజకీయాలకున్న అర్థాన్ని మార్చాం. ఇచ్చిన మాటకు ఎవరైనా కట్టుబడి ఉండాలని చెప్పాం. రాజకీయ అవసరాల కోసం ఇష్టమొచ్చినట్టు మేనిఫెస్టో ఇచ్చేవారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని చెత్తబుట్టలో వేసేవారు. మేనిఫెస్టోను ఒక పవిత్రమైన గ్రంథం మాదిరిగా భావించాం. ప్రతీ అంశాన్నీ నెరవేర్చాలని తపన, తాపత్రయం పడ్డాం. కోవిడ్ ఉన్నా సరే అన్ని హామీలను నెరవేర్చాం. సంక్షోభం ఉన్నా, ఏ రోజూ సాకులు వెతుక్కోలేదు. 99శాతం పైచిలుకు హామీలను నెరవేర్చాం. గడపగడపకూ ప్రతి ఇంటికీ వెళ్లాం. ఇన్ని చేసినా మనం ఓటమి చెందాం. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మారు. ప్రతి ఇంటికీ తన మనుషులను చంద్రబాబు పంపాడు. కరపత్రాలు, బాండ్లు చంద్రబాబు పేరిట పంచారు. ప్రతి వర్గాన్నీ మోసం చేశారు. దీని వల్ల పది శాతం ప్రజలు చంద్రబాబును నమ్మారు. జగన్ చేశాడు కాబట్టి, చంద్రబాబు కూడా చేస్తాడని నమ్మారు. జగన్ కన్నా ఎక్కువ చేస్తానని బాబు అన్న మాటలను నమ్మారు. చంద్రబాబు మారాడేమోనని ప్రజలు నమ్మారు. అందుకే 50 శాతం నుంచి 40 శాతానికి వైసీపీ ఓటు షేర్ తగ్గింది" అని జగన్ వివరించారు. "చంద్రబాబు వచ్చి 11 నెలలు అయిపోయింది. చంద్రబాబు హామీలు నెరవేరుస్తాడని ఆశగా ఎదురుచూస్తున్నారు. మాట ఇచ్చాను కానీ.. ఇప్పుడు భయం వేస్తుందని చంద్రబాబు అంటున్నాడు. రాష్ట్రానికున్న అప్పులపై అబద్ధాలు చెబుతున్నాడు. ఏపీలో రెడ్ బుక్ పాలన కొనసాగుతోంది. అవినీతి విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్రతి గ్రామంలోనూ మద్యం షాపులు, బెల్టుషాపులు, పేకాట క్లబ్ లు, ఇసుక, మైనింగ్ మాఫియాలు నడుస్తున్నాయి. వ్యవస్థలన్నీ పూర్తిగా నాశనం అయిపోయాయి" అని జగన్ ఆరోపించారు."ప్రజల తరపున వైసీపీ కార్యకర్తలు అండగా నిలవాలి. చంద్రబాబు పాలనలో ఆరు నెలలు తిరక్కముందే ప్రజలకు తోడుగా నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రజల తరపున పోరుబాట పట్టాల్సిన పరిస్థితి వచ్చింది. వైసీపీ శ్రేణులు, నాయకులు కలిసికట్టుగా నిలవాలి.. ప్రజలకు తోడుగా నిలవాలి. గ్రామ స్థాయి నుంచి వ్యవస్థీకృతంగా పార్టీ ఉండాలి. ప్రతి సమస్యలోనూ ప్రజలకు తోడుగా నిలవాలి" అని జగన్ పిలుపునిచ్చారు. "రెడ్ బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. తనకు సంఖ్యాబలం లేకపోయినా అన్ని పదవులు తనకే కావాలని చంద్రబాబు అధికార అహంకారం చూపుతున్నారు. 57 చోట్ల స్థానిక సంస్థల ఉపఎన్నికలు జరిగాయి. చంద్రబాబుకు గెలిచే వాతావరణం లేక 7 చోట్ల వాయిదా వేశారు. 50 చోట్ల ఎన్నిక జరిగితే 39 చోట్ల వైసీపీ గెలిచింది. చంద్రబాబు మన పార్టీ కేడర్ ను ఏమీ చేయలేకపోయారు. అప్పటి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ స్వీప్ చేసింది. బలం లేకపోయినా చంద్రబాబు అధికార అహంకారం చూపారు. పోలీసులను వాచ్ మెన్ల కంటే ఘోరంగా వాడుకున్నారు. అసలు చంద్రబాబు ఎందుకు ఇవన్నీ చేస్తున్నారు. ఇంత అప్రజాస్వామికంగా ఎందుకు చేస్తున్నారు? ఎందుకంటే వైసీపీ అంటే చంద్రబాబుకు భయం" అన్నారు. "చంద్రబాబు హామీల అమల్లో, పాలనలో ఘోరంగా విఫలమయ్యారు. టీడీపీ కేడర్, నాయకులు ప్రజల దగ్గరకు వెళ్లే పరిస్థితి లేదు. ప్రజల దగ్గరకు వెళ్తే కచ్చితంగా నిలదీస్తారు. ప్రజలు ప్రశ్నిస్తారనే దారుణాలకు దిగుతున్నారు. ప్రశ్నించే స్వరం ఉండకూడదని రాష్ట్ర వ్యాప్తంగా భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. చర్యకు, ప్రతి చర్య ఉంటుంది. ప్రజలకు మంచి చేయడమే ప్రజాస్వామ్యం. అధికారం ఉందని దురహంకారంతో ప్రవర్తిస్తే ప్రజలు కచ్చితంగా తిప్పికొడతారు. వచ్చే ఎన్నికల్లో సింగిల్ డిజిట్ రాని పరిస్థితుల్లోకి వెళ్తారు. ఏపీ, తమిళనాడు ఎన్నికల్లో ప్రజలు వన్ సైడ్ గా ఇచ్చే తీర్పులు చూశాం. ఈ పక్కన ప్రజలు తంతే.. ఆ పక్కన పడతారు. చంద్రబాబు భయపెట్టే ప్రయత్నాలు ఎక్కువ చేస్తాడు. మనం అప్రమత్తంగా ఉండాలి" అని జగన్ పిలుపునిచ్చారు. "రామగిరి ఎంపీపీ ఉపఎన్నికలో 10కి 9 చోట్ల గెలిచాం. మరి అక్కడ గెలవాల్సింది వైసీపీ కదా?. అక్కడ ఎన్నికను తారుమారు చేయడానికి ప్రయత్నించారు. కోర్టు ఆదేశాలతో ఎంపీటీసీలకు భద్రత ఇవ్వాల్సింది పోయి .. పోలీసులే ఎంపీటీసీలను బెదిరించే కార్యక్రమాలు చేశారు. రామగిరి ఎస్సై.. ఎంపీటీసీల వాహనం ఎక్కాడు వీడియో కాల్ లో ఎమ్మెల్యే, ఎమ్మెల్యే కుమారుడితో బెదిరించారు. టీడీపీకి అనుకూలంగా ఓటేయమని బెదరించారు. ఎంపీటీసీలు ఎన్నిక సమయానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. వేరే మండలానికి తీసుకెళ్లి బైండోవర్ చేసే కార్యక్రమం చేశారు. ధర్నా చేస్తే జిల్లా అధ్యక్షురాలు, ఇంఛార్జ్ పై కేసులు పెట్టారు. మన పార్టీ తరపున యాక్టివ్ గా ఉన్న లింగమయ్యను హత్య చేశారు. ఏపీ పూర్వపు బీహార్ రాష్ట్రంలా తయారైంది" అని జగన్ ఆరోపించారు. "ఇలాంటి పరిస్థితుల మధ్య మనం యుద్ధం చేస్తున్నాం. కష్టాలు అనేవి శాశ్వతంగా ఉండవు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గట్టిగా నిలబడాలి. మన పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. ఈ సారి జగన్ 2.0 పాలన కచ్చితంగా మీరు చూస్తారు. ప్రతి కార్యకర్తకు జగన్ భరోసాగా ఉంటాడు. విలువలు, విశ్వసనీయతకు దర్పణంలా పార్టీని నిలుపుదాం" అని జగన్ ప్రకటించారు.

## పవన్ కల్యాణ్ "అడవి తల్లి బాట"పై వీడియో రిలీజ్..

బాట కార్యక్రమాన్ని జనసేనాని ప్రారంభించారు. గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి అడవి తల్లి బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం ద్వారా గిరిజన గ్రామాల్లో రహదారులు, డ్రెయిన్లతో పాటు పాఠశాలలు, తాగునీటి సౌకర్యం, ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ఈ పథకం కింద రూ. 1,005 కోట్లతో 1,069 కిలోమీటర్ల మేర 625 గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంతో గిరిజన గ్రామాలకు మహర్దశ పట్టనుంది. దీంతో పవన్ చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం పట్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఒంటిమిట్టలో సందడి..

భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.. అయితే, రేపు ఒంటిమిట్ట కోదండ రాముని కళ్యాణోత్సవం జరగనుంది.. సాయంత్రం 6:30 నుంచి రాత్రి 9:30 మధ్య పండు వెన్నెలలో పౌర్ణమి రోజున రాముల వారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు.. సీతారాముల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం చేసింది టీటీడీ.. భక్తులకు పంపిణీ చేయడానికి లక్ష ముత్యాల తలంబ్రాలు ప్యాకెట్లు సిద్ధం చేశారు.. ఇక, రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడపకు రానున్నారు.. రేపు ఒంటిమిట్ట కోదండ రామాలయం కల్యాణోత్సవంలో పాల్గొననున్నారు ఏపీ సీఎం.. ప్రభుత్వం తరఫున రాములవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.. రాత్రికి ఒంటిమిట్టలోని టీటీడీ గెస్ట్ హౌస్ లో బస చేయనున్నారు సీఎం చంద్రబాబు.. 12వ తేదీన తిరిగి కడప ఎయిర్‌పోర్ట్ నుంచి విజయవాడ బయలుదేరి వెళ్లనున్నారు.. కాగా, ఒంటిమిట్ట శ్రీ కోదండ రాముని బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి.. రెండవ అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ రామనవమి, హనుమత్సేవ, ఈ రోజు గరుడసేవ, రేపు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగనుంది. ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలతో పాటు ముత్యాల తలంబ్రాలను స్వామివారికి సమర్పించనున్నారు. అనంతరం గజ వాహన సేవ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 12వ తేదీన రథోత్సవం నిర్వహిస్తారు. ఏప్రిల్ 14వ తేదీన ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. అలాగే, ఏప్రిల్ 15న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది.

## పవన్ అనుకోకుండా డిప్యూటీ సీఎం అయ్యారు: కవిత

ఆమె ఈ విధంగా సమాధానం ఇచ్చారు. ఆయన చేసే ప్రకటనలు ఒకదానికొకటి విరుద్ధంగా దురదృష్టవశాత్తు పవన్ కళ్యాణ్ డిప్యూటీ ముఖ్యమంత్రి అయ్యారని చురకలాంటించారు. చేగువేరా ఆదర్శాలు నచ్చిన వ్యక్తి అప్పుడు రైటిస్ట్ ఎలా అయ్యారు అంటూ ఆగ్రహించారు. ఆయన చేసే ప్రకటనలు ఒకదానికొకటి విరుద్ధం గా ఉంటాయని మండి పడ్డారు. రేపు తమిళనాడు వెళ్లి హిందీ చేయబోమనైన ఆయన చెప్పవచ్చు అంటూ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు.

## తెలంగాణకి భూకంపం ముప్పు

భూకంప తీవ్రత హైదరాబాద్, అలాగే అమరావతి వరకు కూడా ఉంటుందని అంటున్నారు. తెలంగాణకు భూకంపం వచ్చే అవకావం ఉందని ఎర్త్‌క్వేక్ రీసర్చ్ అండ్ అనాలసిస్ అనే సంస్థ స్పష్టం చేసింది. తమ పరిశోధనల ఆధారంగా తెలంగాణలో రామగుండం సమీపంలో భారీ భూకంపం సంభవించి అవకాశం ఉందని.. ఆ ప్రకంపనలు హైదరాబాద్, వరంగల్, అమరావతి వరకు చేరే అవకాశం ఉందని అందులో పేర్కొంది.

## భారత్‌కు చేరుకున్న ముంబై ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వుర్ హస్సేన్ రాణా

**అమెరికా నుంచి అతనిని తీసుకొచ్చిన ప్రత్యేక విమానం**

**ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం**

**తీహార్ జైలుకు తరలించేందుకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సిద్ధం చేసిన అధికారులు**



2008 ముంబై ఉగ్రవాద దాడి కేసులో ప్రధాన నిందితుడైన తహవ్వుర్ హస్సేన్ రాణా భారత్‌కు చేరుకున్నాడు. అతడిని అమెరికా నుండి తీసుకువచ్చిన ప్రత్యేక విమానం గురువారం మధ్యాహ్నం ఢిల్లీ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. అక్కడి నుండి అతడిని అధికారులు ప్రత్యేక భద్రత నడుమ తీహార్ జైలుకు తరలించనున్నారు. రాణాను తరలించేందుకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సిద్ధం చేశారు. తహవ్వుర్ రాణా రాక నేపథ్యంలో ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. పాకిస్థాన్‌లో జన్మించిన తహవ్వుర్ హుస్సేన్ రాణా కెనడా పౌరసత్వం కలిగి ఉన్నాడు. తనను భారత్‌కు అప్పగించవద్దంటూ అతను పలుమార్లు అమెరికా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ నిరాశే ఎదురైంది. రాణా పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడంతో, అతడిని తీసుకు వచ్చేందుకు భారత్ నుండి ప్రత్యేక బృందం అమెరికాకు వెళ్లింది. భారత బృందానికి రాణాను అప్పగించిన అనంతరం, అతను తమ కస్టడీలో లేదని అమెరికా ఫెడరల్ ప్రిజన్స్ బ్యూరో స్పష్టం చేసింది.

## కువైట్‌లో తెలుగు మహిళపై యాసిడ్‌తో దాడి



ఆర్థిక అవసరాల కోసం కువైట్‌కు వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ మహిళపై యజమానులు యాసిడ్ దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపుతోంది. కాకినాడ జిల్లా యూ.కొత్తపల్లి మండలం పొన్నాడకు చెందిన కాకాడ లక్ష్మి, భర్త మరణంతో జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో వైఎస్సార్ జిల్లా చెందిన ఓ ఏజెంట్ ద్వారా రెండు నెలల క్రితం కువైట్‌కు వెళ్లింది. ఓ ఇంట్లో పని చేస్తే నెలకు 150 దీనార్లు వేతనం ఇస్తామని చెప్పగా, అక్కడ చేరిన తర్వాత కేవలం 100 దీనార్లు మాత్రమే ఇవ్వడం ప్రారంభించారు. తన వేతనాన్ని తగ్గించిన విషయంపై యజమానులను ప్రశ్నించగానే లక్ష్మిపై వారు కిరాతకంగా యాసిడ్ పోసి దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మిని పిచ్చాసుపత్రిలో చేర్చారు. ఈ సంఘటన పది రోజుల క్రితం జరిగినట్టు తెలుస్తోంది. కోలుకున్న తర్వాత ఆసుపత్రి సిబ్బందికి వివరాలు చెప్పిన లక్ష్మి ద్వారా విషయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రి సిబ్బంది ఆమెకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించి, ఆమె కుటుంబ సభ్యులకు కూడా సమాచారం ఇచ్చారు.



**పాస్‌పోర్టు అడ్డుకోవడం %-% ప్రభుత్వ స్పందనకు వేచి**

లక్ష్మి తెలిపిన సమాచారం ప్రకారం, ఆమె పాస్‌పోర్టు యజమానుల వద్దే ఉండిపోయింది. కేసును వెనక్కి తీసుకుంటేనే దానిని ఇవ్వబోతున్నామని బెదిరిస్తున్నారట. దీంతో ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలోనే చిక్కుకుని తీవ్ర మనోవేదనతో ఉంది. లక్ష్మిని అక్కడికి పంపిన ఏజెంట్‌ను సంప్రదించగా, తిరిగి పంపించేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి లక్ష్మిని భారత్‌కు రప్పించాలని, న్యాయం చేయాలని ఆమె కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

## భూసమస్యలపై అర్జీల వెల్లువ

### టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన అర్జీదారులు

**-అర్జీలు స్వీకరించిన పరిశ్రమల శాఖ మంత్రి భరత్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు**

మంగళగిరి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భూ సమస్యలతో పాటు వివిధ సమస్యలపై గ్రీవెన్స్ కు తరలివచ్చిన అర్జీదారుల నుండి టీడీపీ కేంద్ర కార్యాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు వినతులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. వెను వెంటనే సబంధిత అధికార్లకు ఫోన్లు చేసి సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని సూచించారు. గురువారం టిడిపి కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం మంత్రి భరత్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

లాలాపేట చిన్నబజారు ఏరియాలో ఉన్న తన స్థలాన్ని అందులో ఉన్న రేకుల షెడ్ ను గుడివాడ వెంకట అప్పాజీరావు, అతని గూండాలు ఆక్రమించి తనను చంపుతామని బెదిరిస్తున్నారని, దయ చేసి తనకు న్యాయం చేయాలని గుంటూరుకు చెందిన మహ్మద్ సుభాని వాపోయారు.

అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం నగిరిపాడు గ్రామంలో 1980లో ప్రభుత్వం తమకు భూమి మంజూరు చేసిందని, తన తండ్రి ఆ భూమిలో వ్యవసాయం చేస్తూ కాలం చేశాడని, అనంతరం కొంత కాలం ఆ భూమి బీడుగా ఉండటంతో వైసీపీ నాయకులు దాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తూ.. అది తమ పేరుమీద ఆన్ లైన్ కాకుండా అడ్డుకుంటున్నారని బాధితులు ఫిర్యాదు చేశారు.




శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం దారపువానిపేట గ్రామానికి చెందిన డి. సన్యాసిరావు.... శ్రీకాకుళం కలెక్టరేట్ ఆఫీసులోని భవన నిర్మాణ పనులను తమ చేత చేయించుకొని జేపీఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు తమకు డబ్బులు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని, దయ చేసి తనకు రావాల్సిన బకాయిలు ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు. ప్రకాశం జిల్లా పెద్దదొర్నాల మండలం పెద్దబొమ్మలాపురం గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి వెంకటేష్ రెడ్డి గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గత టీడీపీ ప్రభుత్వంలో తాము గ్రామంలో సీసీ రోడ్ల పనులు చేయడం జరిగిందని, దానికి సంబంధించిన బిల్లులు రూ. 50 లక్షలు ఇప్పటికి రాలేదని, బయట వడ్డీలకు తెచ్చి పనులు చేశామని, దయ చేసి తమకు రావాల్సిన బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. అనంతపురం జిల్లా కంబదూరు మండలం వై.సీ పల్లి గ్రామానికి చెందిన రైతులు... గత ప్రభుత్వంలో తమ గ్రామంలో జరిగిన రీసర్వే తప్పుల తడకగా ఉండటం వలన డ్రిప్ పరికరాల కోసం ఆన్ లైన్ లో నమోదుకు ఆటంకం కలుగుతుందని.. ఈ సమస్యను త్వరగా పరిష్కరించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## ఇండియాతో సంబంధాలు పెంచుకునేందుకు రెడీ అన్న జిన్ పింగ్

**చైనాపై భారీ టారిఫ్ లు విధించిన డొనాల్డ్ ట్రంప్ - భారత్ కు దగ్గరయ్యేందుకు రెడీ అవుతున్న చైనా**

**భారత్ తో కలిసి పని చేసేందుకు సిద్ధమన్న జిన్ పింగ్**



పొరుగుదేశం చైనాతో భారత్ కు ఎప్పుడూ వివాదం కొనసాగుతూనే ఉంటుంది. పాకిస్థాన్ కు అండగా ఉంటూ భారత్ ను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలను చైనా చేస్తుంటుంది. సరిహద్దుల్లో ఎప్పుడూ ఉద్రిక్తతలను పెంచి పోషిస్తుంటుంది. అయితే, ఇప్పుడు విధిలేని పరిస్థితుల్లో చైనా తన స్టాండ్ ను మార్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి కారణం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. చైనాపై ట్రంప్ ఊహించని విధంగా ఏకంగా 125 శాతం ప్రతీకార సుంకాలను విధించారు. దీంతో, చైనాకు భారీ షాక్ తగిలింది. చైనా విధానాలను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇండియాతో వ్యూహాత్మక సంబంధాలను పెంచుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ సంచలన ప్రకటన చేశారు. బీజింగ్ లో జరిగిన ఉన్నతస్థాయి కేంద్ర కమిటీ సమావేశంలో జిన్ పింగ్ మాట్లాడుతూ... భారత్ తో అభిప్రాయ భేదాలను తగ్గించుకుని, సరఫరా వ్యవస్థలను పెంపొందించుకునేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. భారత్ తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇరు దేశాల మధ్య ఒక మంచి ఉమ్మడి సమాజాన్ని నిర్మిస్తామని చెప్పారు. జిన్ పింగ్ వ్యాఖ్యలపై భారత్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## మెట్టు దిగిన మావోలు

### శాంతి చర్చలకు సిద్ధమంటూ లేఖ

రాయపూరు ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**వరుస ఎన్కౌంటర్లతో సతమతమవుతున్న మావోయిస్టులు ఒక మెట్టు దిగివచ్చారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలపై మరోసారి ప్రకటన విడుదల చేసింది. అధికార ప్రతినిధి ఉత్తర పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో రూపేష్ పేరుతో ఓ ప్రకటన విడుదల చేసింది. శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, శాంతి చర్చల కోసం అనుకూల వాతావరణం ఏర్పరచాలని కోరింది. తమ వైపు నుంచి శాంతియుత వాతావరణాన్ని ఏర్పరుస్తున్నామని, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే పూర్తి యుద్ధం విరామం ప్రకటిస్తామని ఆ ప్రకటనలో మావోయిస్టు పార్టీ పేర్కొంది. ప్రభుత్వం తన వైఖరి వెల్లడించిన తర్వాత మరింత స్పష్టతతో నిర్ణయం తీసుకుంటామంది.**



బస్తర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని ఆపాలని, కగార్ నిలిపివేయాలని మావోయిస్టు పార్టీ కోరింది. తమ డిమాండ్‌ను ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ నిరాకరించారని, ప్రభుత్వం శాంతి చర్చలకు సిద్ధంగా లేదని మావోయిస్టు పార్టీ పేర్కొంది. ప్రజలు భయోత్పాత వాతావరణంలో జీవిస్తున్నారని, యువతి-యువకులు పారిపోతున్నారని, ఈ దిశగా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని కోరింది. బస్తర్ నుంచి మావోయిస్టు నాయకత్వం పారిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మారణకాండను సమర్థించుకోవడానికి తాము అభివృద్ధి వ్యతిరేకులమని ముద్ర వేస్తున్నారని పేర్కొంది. తాము స్కూలు, హాస్పిటల్స్, అంగన్ వాడి, రేషన్ దుకాణాలు, తాగునీరు, కరెంటుకు వ్యతిరేకం కాదని స్పష్టం చేసింది. తమ నుంచి కూడా ఒకటి, రెండు విషయాల్లో తప్పులు జరిగాయని, వాటికి మేము క్షమాపణలు కూడా కోరామంది. జల్-జంగల్-జమీన్ నుంచి బేదాఖలు చేసే పర్యావరణానికి నష్టం కలిగించే ప్రాజెక్టులను వ్యతిరేకించామని మావోయిస్టు పార్టీ ఆ ప్రకటనలో పేర్కొంది. మావోయిస్టు కేంద్ర కమిటీ ఇటీవల శాంతి చర్చల గురించి ఒక స్టేట్‌మెంట్ విడుదల చేసిందని, అందులో కూడా శాంతి చర్చలకు అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చాలని కోరిందని మావోయిస్టు పార్టీ తెలిపింది. తమ కోరికను ఛత్తీస్‌గఢ్ సీఎం విజయశర్మ నిరాకరించారని పేర్కొంది. అనుకూల వాతావరణం లేకుండా శాంతి చర్చలు సాధ్యం కావని స్పష్టం చేసింది. ఇప్పటి వరకూ అనుసరిస్తున్న వైఖరినే ఇంకా కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి మాటల ద్వారా స్పష్టమవుతున్నదని పేర్కొంది. దీనిని తాము వ్యతిరేకిస్తున్నామంది. ప్రభుత్వం అనుసరిస్తున్న లొంగుబాటు విధానమే సమస్యకు పూర్తి పరిష్కారం అని చెప్పడాన్ని కూడా మావోయిస్టు పార్టీ తిరస్కరించింది.



**బీహార్‌లో ఈదురు గాలులు, వడగళ్ల వాన...**

## పిడుగులు పడి 13 మంది మృతి

ఈదురు గాలులు, వడగళ్ల వాన బీహార్‌లోని పలు జిల్లాలను అతలాకుతలం చేస్తున్నాయి. పిడుగులు పడి రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే, బెగూసరాయ్, దర్భాంగా జిల్లాల్లో వేర్వేరు ఘటనల్లో 9 మంది మృతి చెందారు. మధుబనిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, వీరిలో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కుమార్తె ఉన్నారు. సమస్తిపూర్‌లోనూ ఓ వ్యక్తి పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. పిడుగుపాటుకు మరణించిన వారి కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్టు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రకటించారు. బాధిత కుటుంబాలకు సీఎం సంతాపం తెలిపారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో విపత్తు నిర్వహణశాఖ జారీచేసే సూచనల ప్రకారం నడుచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఉభయ గోదావరి జిల్లాల వార్తలు

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

శుక్రవారం11 ఏప్రిల్ 2025





## ప్రజల దాహార్తి తీర్చడానికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

**భీమవరంలోని కొత్త బస్టాండ్ లోను, కలక్టరేట్ లో యూవీ వాటర్ ప్లాంట్ లను ప్రారంభించిన ప్రారంభించిన కేంద్రమంత్రి, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే**

భీమవరం, ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి రక్షిత తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరం ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ సహకారంతో సుమారు రూ 8 లక్షలతో కొత్త బస్టాండ్ లోనూ, కలక్టరేట్ లోనూ రెండు యూవీ వాటర్ ప్లాంట్ లను కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, జిల్లా కలెక్టర్ నాగరాణి, 20 సూత్రాల చైర్మన్ దినకర్, ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కేంద్రమంత్రి వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. బస్టాండ్ లో ప్రయాణికులకు, కలెక్టరేట్ కు వచ్చే ప్రజలకు దాహార్తి సమస్య లేకుండా ఈ వాటర్ ప్లాంట్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎంవిఆర్ వరప్రసాద్, డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, ఉద్దరాజు కాశీ విశ్వనాధరాజు, కంతేటి వెంకటరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, చెరుకువాడ రంగసాయి, కారుమూరి సత్యనారాయణ మూర్తి, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## విద్యాగణపతి ఆలయంలో కూటమి నాయకులు పూజలు

**మార్క్ శంకర్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ అభిషేకాలు, గరిక పూజ**



భీమవరం, ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ భీమవరం విద్య గణపతి ఆలయంలో గురువారం కూటమి నాయకులు పూజలను నిర్వహించారు. సింగపూర్ పాఠశాలలో ఫైర్ ఆక్సిడెంట్ జరిగి గాయాలతో ఉన్న మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆలయంలో చిన్నారి పేరున పూజలు చేశారు. విద్యా గణపతి స్వామి వారికి అభిషేకాలు, సహస్ర గరిక పూజ కార్యక్రమాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి చినబాబు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరి, జనసేన పట్టణ చెనమల్ల చంద్రశేఖర్ ఆదేశ మేరకు పూజా కార్యక్రమాలు నిర్వహించామని కూటమి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో భీమవరం జనసేన నాయకులు వేలూరి బుజ్జి, తెలుగుదేశం జిల్లా సాధికారిక అధ్యక్షులు చెరుకుపల్లి సంతోష్, బ్రహ్మజ్యోసుల సత్యప్రసాద్. చందూరి కామేష్, బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యం, పచ్చళ్ళ శ్రీనివాస్, బొల్లాప్రగడ ప్రభాకర్, శేషు, కొండేపూడి మణికాంత్, వేలూరి శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## క్యాంటీన్ లలో పరిశుభ్రత లేకుంటే కఠిన చర్యలు తప్పవ్ .. జిల్లా కలెక్టర్



భీమవరం, ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

క్యాంటీన్ లలో పరిశుభ్రత లేకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. గురువారం భీమవరం కొత్త బస్టాండ్ లోని క్యాంటీన్, పలు స్టాల్స్ లను కలెక్టర్ నాగరాణి పరిశీలించారు. క్యాంటీన్ లోని టిఫిన్స్ తిని పరిశుభ్రతలను స్వయంగా పరిశీలించారు. ఎక్కడిక్కడ చెత్త లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రయాణికులకు ఇబ్బందులు టాయ్ లెట్స్ కూడా శుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

## రైతుల వద్దకే ప్రజా ప్రభుత్వం: - ఎమ్మెల్యే సత్యానందరావు



ఆత్రేయపురం, ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

: రైతుల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకొస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం లొల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల ద్వారా రబీ సీజన్ ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ధాన్యం ఎక్కడో సుదూర ప్రాంతాల మిల్లుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేసారు. సరైన పద్ధతి లేక ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. నానా కష్టాలు పడి ధాన్యం అమ్మితే ఆ సొమ్ము ఎప్పుడు వస్తుందో కూడా అర్థం కాని పరిస్థితి ఉండేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లోనే రైతుల ధాన్యం రైతుల సమక్షంలోనే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం సొమ్మును రైతుల ఖాతాల్లో వేయడానికి 48 గంటలు సమయం ఇచ్చినా కేవలం రెండు గంటల వ్యవధిలో సొమ్ములు జమ చేయడం జరిగిందని చెప్పారు. ఈ రబీ సీజన్లో సాధారణ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2300, 75 కేజీలకు రూ.1725 చొప్పున కనీస మద్దతు ధర ఇస్తున్నామన్నారు.అలాగే ఏ రకం గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2320, 75 కేజీలకు రూ.1740 కనీస మద్దతు ధర ఉందన్నారు. అంతే కాకుండా గోనె సంచులు, హమాలీ, రవాణా చార్జీలను రైతుల ఖాతాల్లోకి చెల్లించే వెసులుబాటును కూటమి సర్కార్ కల్పించిందని తెలిపారు. రైతే రాజు అన్న మాటను నిజం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ ), సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు కరుటూరి నరసింహారావు, సర్పంచ్ కాయల జగన్నాథం, దాట్ల సూర్యనారాయణ, కల్లూరి సత్తిపండు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి నాటక పోటీల కళావేదికకు శంకుస్థాపన



భీమవరం, ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భీమవరంలోని డిఎన్నార్ కళాశాల గన్నాబత్తుల వారి క్రీడా మైదానంలో చైతన్య భారతి సంగీత నృత్య నాటిక పరిషత్ 18వ జాతీయస్థాయి నాటిక పోటీల కళా వేదికకు గురువారం పరిషత్ సభ్యులు శంకుస్థాపన చేశారు. ఈనెల 24 నుంచి 27వ తేదీల్లో భీమవరంలో చైతన్య భారతి నాటికల పోటీలను నిర్వహిస్తున్నట్లు నాటక పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు రాయప్రోలు భగవాన్, మంతెన రామ్ కుమార్ రాజు, పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో భాగంగానే వేదిక నిర్మాణానికి 9.36 నిమిషాలకు శంకుస్థాపన చేసుకున్నామని, 17 ఏళ్లుగా భీమవరంలో చైతన్య భారతి నాటక పరిషత్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నాటక పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ కూనపరాజు రామకృష్ణ%శీ%రాజు, అసిస్టెంట్ సెక్రటరీ బోసురాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాయప్రోలు శ్రీనివాసమూర్తి, విహెచ్ పి ప్రాంతీయ అధ్యక్షులు వబిలిశెట్టి వెంకటేశ్వరులు, నాటక పరిషత్ సభ్యులు కోశాధికారి బొండా రాంబాబు, కోట్ల నాని, కె సత్యకుమర్, పేరిచర్ల లక్ష్మణ వర్మ, పెన్నాడశ్రీను, కనగర్ల రామకృష్ణ, కొణకంచి రమణమూర్తి, సహాయ కార్యదర్శి యమ్ హేమసుందర్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ హయాంలో రహదారులకు మహర్దశ



ఆత్రేయపురం ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లు అధ్వాన్నమై గుంతల ఆంధ్రప్రదేశ్ గా మారితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారులన్నీ అభివృద్ధి చెందాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామంలో అమలాపురం – బొబ్బర్లంక ప్రధాన రహదారి నుంచి రజకుల పేటకు ఏటిగట్టు మీదుగా రూ.50 లక్షల ఎంపీ లాడ్స్ (రాజ్యసభ) నిధులతో నిర్మించే తారు రోడ్డుకు ఎమ్మెల్యే సత్యానందరావు శంకుస్థాపన చేశారు. అలాగే గోదావరి గట్టు నుంచి ఎస్సీ కాలనీ మీదుగా వద్దిపర్రు పంచాయితీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని రూ.50 లక్షల ఎంపీ లాడ్స్ (రాజ్యసభ) నిధులతో అభివృద్ధి చేసే పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ ), సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు కరుటూరి నరసింహారావు, పి.ఎస్.రాజు, జుజ్జవరపు శ్యామల, హరిబాబు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పోస్టల్ డివిజనల్ లెవెల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ వేడుకలు

ఏలూరు ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పోస్టల్ డివిజనల్ లెవెల్ ఎక్సలెంట్ అవార్డ్స్24- 25 కార్యక్రమం గురువారం జిల్లా పరిషత్ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆడిటోరియం హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా పోస్టల్ సూపరి%శీ%డెంట్ ఎస్. శ్రీకర్ బాబు మాట్లాడుతూ ఏలూరు జిల్లా కార్యాలయాల్లో వివిధ రకాల పోస్టల్ ఇన్సూరెన్స్ లు అత్యధిక శాతంలో చేయించిన ఏలూరు నార్త్, ఏలూరు సౌత్ జోన్ లలో సుమారు 350 మంది ఉద్యోగులు ప్రతిభ కనబరిచారు. 24-25 ఆర్థిక సంవత్సరంలో శత శాతం లక్ష్యాన్ని పూర్తి చేసి విజయాన్ని సాధించింది అన్నారు.ఏలూరు జిల్లాలో రెండు ప్రధాన కార్యాలయలు ఉన్నాయని అన్నారు.సంఖ్య స్థాయిలో గ్రామీణ తపాల కార్యాలయాలు అత్యధిక%శీ%లో ప్రథమ స్థానం దక్కించుకుందన్నారు. అందరి ఉద్యోగుల్లో స్ఫూర్తి నింపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పోస్టల్ కుటుంబమంతా రాబోయే ఆర్థిక సంవత్సరంలో కూడా ఉద్యోగులు లక్ష్యాలను సాధించే దిశగా ఐక్యతతో పనిచేయాలని శ్రీకర్ బాబు దిశా నిర్దేశం చేశారు. అనంతరం విజేతలకు శాలువా కప్పి,పూలదండలు వేసి ప్రశంసాపత్రాలు,షీల్డ్స్ అందజేసి ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి శ్రీనివాసరావు అసిస్టెంట్ సూపరి%శీ%డిండెంట్ ఏలూరు, కె. శ్రీనివాసరావు జంగారెడ్డిగూడెం మరియు డి.శ్రీకాంత్ ఇన్స్పెక్టర్ ఏలూరు సౌత్ సబ్ డివిజన్, జి.దుర్గారావు నార్త్ సబ్ డివిజన్, కె.రాజేష్ సీనియర్ మేనేజర్ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఏలూరు తదితర పోస్టల్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## తిరుమల తరహాలో కోనసీమ తిరుమల


**..వకుళమాత ఆలయం**

**..మాస్టర్ ప్లాన్ రూపకల్పన**

**..అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం**


అమలాపురం, ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తిరుమల తిరుపతి దేవస్థానం తరువాత అదే స్థాయిలో ఆధ్యాత్మిక వాతావరణం లో కోనసీమ తిరుమల వాడపల్లిని తీర్చిదిద్దడం జరుగుతోందని ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ప్రస్తుతం వార్షిక కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి అన్నారు. కాకినాడలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన చక్రధర రావు మీడియాతో మాట్లాడారు. గత ఏడాదికి మించిన స్థాయిలో ఈ ఏడాది వార్షిక కళ్యాణానికి భక్తులు భారీగా తరలివచ్చారని తెలిపారు.వకుళా మాత ఆలయ నిర్మాణం జరుగుతోంది అన్నారు. అదేవిధంగా రూ 1.5 కోట్లు పైగా విచించి శాశ్వత స్టీల్ క్యూ లైన్ల నిర్మాణంచేపట్టినట్లు తెలిపారు. అదనంగా 75 టాయిలెట్లు నిర్మాణం దశలో ఉన్నాయన్నారు. కంపార్ట్మెంట్లు కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. తిరుమలలో స్వామివారి భక్తులు దర్శనం కోసం ఎలా ఎదురు చూస్తారో అదే విధంగా కోనసీమ తిరుమల ఎర్రచందన విగ్రహం లో స్వయంభుగా వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దర్శనం భక్తులు వేచి ఉండే విధంగా వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు, దాతలు, గ్రామస్తుల సహాయ సహకారాలు అందిస్తున్నారని వెల్లడించారు. పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రతి శనివారం వచ్చే భక్తులకు ధర్మపదం పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతోంది అన్నారు. కూచిపూడి, భరతనాట్యం వంటి సాంప్రదాయ కళలతో పాటు అంతరించిపోతున్న రాష్ట్ర కళలైన హరికథ, బుర్రకథ, ఒగ్గు కథ వంటివి ఏర్పాటు చేస్తున్నామని ప్రతి శనివారం ధర్మపదం కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు .భక్తులు ఎండలో వచ్చినప్పుడు, ప్రదక్షిణలు చేస్తున్నప్పుడు కాళ్లు



కాలకుండా పైన నీడ సౌకర్యం, కింద కార్పెట్లు వేయడం జరుగుతుంది అన్నారు. తమ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించడం వల్ల తానీ పనులు చేపట్టగలుగుతున్నాను అన్నారు. ఇంజనీరింగ్ అధికారుల సహకారం కూడా ఉంది అన్నారు. శనివారమే కాకుండా మామూలు రోజుల్లో కూడా పెద్ద ఎత్తున భక్తుల రాక ఆలయానికి ప్రారంభమైందని తెలిపారు. భక్తులు మొక్కుబడులు, కానుకల రూపంలో స్వామివారికి ఇచ్చే ప్రతి రూపాయి సద్వినియోగం అయ్యేలా ధార్మిక కార్యక్రమాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గత వారం రోజులుగా జరుగుతున్న కార్యక్రమాలకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని అన్నదానం లో రెగ్యులర్ గా పెట్టే భోజన కార్యక్రమం తో పాటు భక్తులు త్వరగా భోజనం చేసే విధంగా బయట కూడా భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల నిఘాతో ఎక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి వెంటనే పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు.గోదారి గట్టున జల్లు స్నానాలు ఏర్పాటు చేశామని. వాటిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. శ్రీ భూ సమితుడైన వెంకటేశ్వర స్వామి సన్నిధిలో డిప్యూటీ కమిషనర్, ఈవోగా కాకుండా సాధారణ భక్తుడిలా తాను సేవలందిస్తున్నట్లు తెలిపారు .అర్చకులు వేద పండితులు, సిబ్బంది సహాయ సహకారాలతో, సమన్వయంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికే చిన్న తిరుపతి స్థాయిలో ఈ ఆలయం ఎదిగిందని, త్వరలోనే రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద ఆలయంగా, తిరుమల తరహాలో ఈ ఆలయాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. వాడపల్లి వెంకన్న ఆశీస్సులు ఉండడం వల్లే తాను ఈ కార్యక్రమాలు చేపట్టగలుగుతున్నట్లు తెలిపారు. వచ్చిన ప్రతిభక్తులు స్వామి అమ్మవార్లను దర్శించి ప్రసాదం తీసుకుని అన్నదానంలో పాల్గొని సంతృప్తితో వెళ్తున్నారని, అదే తాము కోరుకుంటున్నామన్నారు. ఎండ ఎక్కువగా ఉండటంతో భక్తులకు మజ్జిగ, మంచినీరు ,చిన్న పిల్లలకు పాలు, బిస్కెట్లు వంటి సౌకర్యాలు కూడా సమకూరుస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు ఈసారి అదనంగా బయట కూడా డిజిటల్ స్క్రీన్లు, అదనపు కంపార్ట్మెంట్లు, ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. పోలీసుల సహకారం కూడా తమకు పూర్తిస్థాయిలో ఉంది అన్నారు. అవును బాధ్యతలు చేపట్టడానికి ముందు దర్శనానికి ఐదు, ఆరు గంటల సమయం పట్టేది ఇప్పుడు రెండు గంటల లోపే దర్శనమయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. అదేవిధంగా ఉచిత దర్శనం కూడా శీఘ్రగతిన దర్శనమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు, శనివారాల తరహాలోనే ఇతర వారాల్లో కూడా భక్తులు స్వామివారిని దర్శించుకునే ప్రదక్షిణాలు చేస్తున్నారని అందుకే నిత్యాన్నదానంలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరిగింది అన్నారు. అన్నదానంలో కూడా భారీ మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. తాను ఓ కార్యక్రమం కోసం కాకినాడ విచ్చేసినట్లు తెలిపారు. తిరిగి సాయంత్రం సదస్సు కార్యక్రమంలో పాల్గొంటున్నానని వెల్లడించారు. డ్యూటీ 50 లక్షల రూపాయలు వెచ్చించి డార్మిటరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు.

# ఏఐ రాకతో సాంకేతిక యుద్ధం జరుగుతోంది: రాజ్‌నాథ్ సింగ్



**చెన్నై: రాజకీయ, సైనిక లక్ష్యాలను సాధించుకునేందుకు కొందరు సైబర్ దాడులను సాధనాలుగా వినియోగిస్తున్నారని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం కూడా ఇందులో ఓ భాగమని వ్యాఖ్యానించారు. తమిళనాడులోని డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.**

ప్రస్తుతం కొనసాగుతున్న సంఘర్షణలు, పరిస్థితులు సంప్రదాయ యుద్ధాలకు భిన్నంగా మారుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. "నానాటికీ అభివృద్ధి చెందుతున్న సాంకేతికత మానవ ప్రమేయం లేని వ్యవస్థను సృష్టిస్తోంది. చాలా విషయాలను ఏఐ అంచనా వేయడం చూస్తున్నాం. ఇప్పుడు సంప్రదాయ యుద్ధాలు (భూమి, జల, వాయు మార్గాల్లో చేసే యుద్ధం) చేసుకునే కాలం పోయింది. ఏఐ రాకతో సాంకేతిక యుద్ధం జరుగుతోంది" అని ప్రసంగించారు.

"ప్రస్తుతం మనమంతా 'గ్రే జోన్', హైబ్రిడ్ యుద్ధ శకంలో ఉన్నాము. రాజకీయ, సైనిక లక్ష్యాలను సాధించుకోవడానికి కొందరు సైబర్ దాడులను వినియోగిస్తున్నారు. ఆర్థిక యుద్ధం అనేది ఒక్క తూటా కూడా పేల్చకుండా రాజకీయ, సైనిక లక్ష్యాలను అమలుచేయగలవు. అందుకే వీటిని సాధనాలుగా మలుచుకుంటున్నారు. సైబర్, అంతరిక్షం, సమాచార యుద్ధాలు కూడా సంప్రదాయ యుద్ధంలా ఎంతో శక్తిమంతమైనవి. వీటితో పోరాడేందుకు బహుళ- డొమైన్ వాతావరణంలో సాయుధ దళాలు కలసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది" అని నొక్కి చెప్పారు. "మన పొరుగునున్న ప్రాంతాల నుంచి మనపై పరోక్ష యుద్ధం జరుగుతోంది. అక్కడినుంచి ఉగ్రవాద ముప్పుతో ఇది మరింత తీవ్రమవుతోంది. సైబర్ దాడులకు బలికాకుండా ఉండాలంటే మనమంతా కలిసి పోరాడాలి" అని అన్నారు.

# తహవ్వుర్ రాణా అప్పగింత.. భారత్‌కు అతి పెద్ద దౌత్య విజయం

## అమిత్ షా



**ముంబయి పేలుళ్ల కేసులో నిందితుడు తహవ్వుర్ రాణాను గురువారం భారత్‌కు తీసుకురానున్న సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందించారు. అతడి అప్పగింత భారత్‌కు అతిపెద్ద దౌత్య విజయంగా పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు.**

'భారతదేశానికి, ఇక్కడి ప్రజలకు హాని కలిగించే వ్యక్తులను ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం విడిచిపెట్టదు. బాంబు పేలుళ్లు ఎవరి హయాంలో జరిగాయో వారు అతడిని వెనక్కి తీసుకురాలేకపోయారు. కానీ, మేము వారిని తిరిగి తీసుకొస్తున్నాం. తహవ్వుర్ రాక భారత్‌కు అతిపెద్ద దౌత్య విజయం. ఇది మోదీ ప్రభుత్వ దౌత్య నైపుణ్యాన్ని, న్యాయంపై నిబద్ధతను తెలియజేస్తుంది' అని షా పేర్కొన్నారు. ఈసందర్భంగా దేశానికి వ్యతిరేకంగా దాడులు చేసే వారిని మోదీ ప్రభుత్వం వెంటాడుతూనే ఉంటుందన్నారు.

26/11 దాడిగా ప్రసిద్ధమైన ముంబయి ఉగ్రదాడికి రాణా సూత్రధారిగా వ్యవహరించాడు. అమెరికా తనను భారత్‌కు అప్పగించకుండా ఉండేందుకు అందుబాటులోని అన్ని న్యాయమార్గాలనూ రాణా ఉపయోగించుకున్నాడు. అయితే, వాటన్నింటి నుంచి అతడికి నిరాశే ఎదురయ్యింది. చివరగా ఇండియాకు అప్పగించవద్దంటూ అమెరికా సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ సైతం తిరస్కరణకు గురైంది. దీంతో అతడిని భారత్‌కు అప్పగించేందుకు మార్గం సుగమమైంది.

ఈక్రమంలోనే భారత్‌కు చెందిన అధికారుల బృందం అగ్రరాజ్యానికి వెళ్లి అవసరమైన పత్రాలు సమర్పించి చట్టపరమైన లాంఛనాలను పూర్తి చేసింది. బుధవారం రాత్రి 7:10 గంటలకు ప్రత్యేక విమానంలో తహవ్వుర్‌ను తీసుకుని అధికారులు ఇండియాకు బయలుదేరారు. గురువారం మధ్యాహ్నం వీరు ఇక్కడికి చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడికి వచ్చాక అతడిని ఎన్ఐఏ అధికారికంగా అరెస్టు చేసి.. తిహాడ్ జైలుకు తరలించనున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే జైలు చుట్టూ కట్టుదిట్టమైన భద్రతను సైతం ఏర్పాటుచేశారు.

తహవ్వుర్ రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. 26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారి. 2008లో నవంబరు 26న జరిగిన ఈ దాడిలో 166 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు.

# కొత్త వక్ఫ్ చట్టాన్ని అమలుచేయబోం: మమత



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. మైనారిటీలు, వారి ఆస్తులను రక్షిస్తానని హామీ ఇచ్చారు. కోల్‌కతాలో బుధవారం జైన సమాజం నిర్వహించిన ఒక కార్యక్రమంలో దీదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "వక్ఫ్ సవరణ చట్టం అమలు కారణంగా ముస్లింలు బాధపడుతున్నారని నాకు తెలుసు. నమ్మకం ఉంచండి. బెంగాల్‌లో విభజించు-పాలించు అనేది జరగదు. ఒకప్పుడు బంగ్లాదేశ్, పాకిస్థాన్, భారతదేశం కలిసి ఉండేవి. తర్వాతే విభజన జరిగింది. ఇక్కడే ఉండిపోయిన మైనారిటీలకు రక్షణ కల్పించడం మన బాధ్యత. దీదీ ఉన్నంతకాలం మిమ్మల్ని, మీ ఆస్తుల్ని రక్షిస్తుందని మాత్రం మరచిపోవద్దు" అని మమత చెప్పారు.

# రావులపాలెంలో కిడ్నాప్ కలకలం!

రావులపాలెం, ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే కోనసీమ ముఖద్వారం రావులపాలెం గ్రామంలో ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఒక వ్యాపారిని కిడ్నాప్ చేయడం కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం రావులపాలెం ఆదిలక్ష్మి నగర్ 5వ వీధికి చెందిన చెందిన శిరగం రమేష్ హోల్ సేల్ పండ్ల వ్యాపారం చేస్తుంటారు. మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో తోటల్లో పండ్లను హోల్ సేల్ గా కొనుగోలు చేసి హోల్ సేల్ గా విక్రయాలు చేస్తుంటారు. అలాగే రావులపాలెంలో ఒక లాడ్జి, జ్యూస్ సెంటర్ కూడా నడుపుతున్నారు. ఈ క్రమంలో తాజాగా మహారాష్ట్రకు చెందిన వ్యక్తులతో ఆర్థిక లావాదేవీల్లో విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో రమేష్ తండ్రి శిరగం మురళి హర సుబ్బారావును (65) బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసారు. రావులపాలెం సెంటర్లోని జ్యూస్ షాప్ మూసివేసి మోటార్ సైకిల్ పై ఇంటికి వస్తుండగా ఇంటికి సమీపంలో అతని మోటార్ సైకిల్ ను మరొక మోటార్ సైకిల్ పై వచ్చి అడ్డగించారు. కిడ్నాప్ చేసి కారులో తీసుకుపోయారు. దీంతో కుమారుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వీరి వద్ద గుమాస్తాగా పనిచేస్తున్న సమీప బంధువును కిడ్నాప్ కు సూత్రధారిగా భావిస్తూ అతడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. అతను ఇచ్చిన ఆధారాలతో పోలీసులు కిడ్నాపర్ల కోసం మహారాష్ట్ర బయలుదేరి వెళ్ళినట్టు సమాచారం.

# ఆయనది డేరింగ్ పర్సనాలిటీ.. నేనూ అలానే ఉంటా: ఢిల్లీ సీఎం రేఖాగుప్తా



**దిల్లీ: దేశ రాజధాని దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలను కొనియాడారు. మోదీని ఆమె సాధువు మనస్తత్వంతో పోల్చారు. అమిత్ షా మాదిరిగా తాను ఉండాలని కోరుకుంటున్నట్లు ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం వెల్లడించారు.**

"ప్రధాని మోదీ సాధువు మనస్తత్వం కలవారుగా భావిస్తున్నా. సాధారణంగా కొందరు భగవంతుడి సేవకు తమ జీవితాన్ని అంకితం చేస్తారు. కానీ, దేశానికి సేవ చేసేందుకు ప్రధాని తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన బాటలో నడుస్తున్న వారు మా పార్టీలో చాలా మంది ఉన్నారు. వారిలో కేంద్రమంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ కూడా ఉన్నారు" అని పేర్కొన్నారు.

"కేంద్ర హోంమంత్రి అమిత్ షా డేరింగ్ పర్సనాలిటీ. ఎంత క్లిష్ట పరిస్థితులనైనా ఆయన ఎదుర్కోగలరు. ఆ సమయంలో కఠిన నిర్ణయాలు తీసుకుని చివరి వరకు వాటిని పాటిస్తారు. ఆ సామర్థ్యం ఆయనకుంది. ఆయన మాదిరి నేను ఉండాలని కోరుకుంటున్నాను. దేశం పట్ల భాజపా ఎంతో విధేయతతో ఉంటోంది' అని కొనియాడారు. కాగా.. ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 27 ఏళ్ల తర్వాత భాజపా అధికారం చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. మహిళా నాయకత్వానికి పెద్ద పీట వేసిన కాషాయ పార్టీ.. రేఖా గుప్తాకు సీఎం పదవి కట్టపెట్టింది.

# మేము చైనీయులం.. రెచ్చగొడితే భయపడం: చైనా విదేశాంగ శాఖ



**అమెరికా : చైనా దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్‌లపై ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ తీవ్రంగా స్పందించారు. తాము చైనీయులమని.. కవ్వింపు చర్యలకు భయపడమని పేర్కొంటూ ఒక పాత వీడియోను ఆమె పంచుకున్నారు.**

డ్రాగన్ దిగుమతులపై 125 శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై నింగ్ ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. 'మేము చైనీయులం. కవ్వింపు చర్యలకు భయపడం. టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గం' అని పేర్కొన్నారు. దీనికి ఆమె 1953 నాటి వీడియోను పంచుకున్నారు. నాడు కొరియా యుద్ధం నేపథ్యంలో డ్రాగన్ నాయకుడు మావో జెడాంగ్ ప్రసంగించిన వీడియో అది. అందులో 'ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందో మేము నిర్ణయించలేం.. అది వాళ్ల (అమెరికా) ఇష్టం. ఇది ఎంతకాలం సాగినా మేము వెనక్కి తగ్గం. పూర్తిగా విజయం సాధించేవరకు పోరాడతాం' అని జెడాంగ్ పేర్కొన్నారు.

అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతోంది. డ్రాగన్ దిగుమతులపై ఉన్న 20 శాతం సుంకాలకు అదనంగా 34 శాతం విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ ప్రకటించారు. దీనిపై డ్రాగన్ దీటుగా స్పందించింది. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది. బీజింగ్ చర్యపై ట్రంప్ భగ్గుమన్నారు. చైనాకు డెడ్‌లైన్ పెట్టి.. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే 104 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. ఈ బెదిరింపుల నేపథ్యంలో అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకం విధిస్తున్నట్లు బీజింగ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో చైనాపై మరో 50 శాతం కలిపి మొత్తంగా 125 శాతం టారిఫ్‌ను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇదిలాఉండగా.. ఇటీవల పలు దేశాలపై విధించిన సుంకాలపై ట్రంప్ కాస్త వెనక్కి తగ్గారు. 90 రోజుల పాటు ఆయా టారిఫ్‌లను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అయితే, వాటిపై 10 శాతం సుంకాలు మాత్రం అమల్లో ఉంటాయన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# జగన్ పాలనలో వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి..
# ఆక్సిజన్ అందిస్తున్న చంద్రబాబు

**-గనులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర**

అనంతపురం, ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



అనంతపురం, ఏప్రిల్ 10(గోదావరి ప్రతినిధి): జగన్ పాలనలో వెంటిలేటర్ మీద ఉన్న రాష్ట్రానికి చంద్రబాబు ఆక్సిజన్ అందించి కాపాడుతున్నారని రాష్ట్ర గనులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. అనంతపురం జిల్లా టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. పలువురు తాగు నీరు, ఇంటి పట్టాలు, ఇరిగేషన్ సమస్యలను రవీంద్ర దృష్టికి తేగా వాటిని పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. జగన్ రెడ్డి బినామీల ఆక్రమణలో ఉన్న భూములు తిరిగి ఇప్పించాలని వచ్చిన పిర్యాదును పరిష్కరించాల్సిందిగా రెవెన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. అనంతపురం అంటే టీడీపీకి కంచుకోట అన్నారు. జగన్ పాలనలో వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి చంద్రబాబు పాలనలో ఆక్సిజన్ అందిస్తున్నారని చెప్పారు. అనంతపురం జిల్లాను సస్యశ్యామలం చేసేలా హంద్రీనీవా, కియా, హార్టికల్చర్ అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. సోలార్, విండ్ ఏర్పాటు ద్వారా జిల్లా స్వరూపం మార్చేలా చర్యలు చేపట్టామన్నారు. జగన్ పాలనలో సింగిల్ డిజిట్ ఉన్న ఆర్థిక అభివృద్ధిని 12 శాతానికి పెంచామని ఆయన తెలిపారు. 2047 నాటికి 15 శాతానికి పెంచేలా టార్గెట్ నిర్దేశించుకుని పాలన సాగిస్తున్నామని చెప్పారు. ఏపీని ప్రపంచానికి ఆదర్శవంతంగా మార్చేలా పి-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రి రవీంద్ర తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పేద కుటుంబాలను గుర్తించి, ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, ఉద్యోగ పరంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 64 లక్షల మందికి రూ.4000 చొప్పున పెన్షన్లు ఇస్తున్న ఘనత మన ప్రభుత్వానిదే అని చెప్పారు. గుంతలు లేని రోడ్లు, గ్రామ గ్రామాన సీసీ రోడ్లు, ఇళ్ల నిర్మాణం, స్వయం ఉపాధి రుణాలతో ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నామని వివరించారు. పిఎం సూర్య ఘర్ కార్యక్రమం ద్వారా ప్రతి నియోజకవర్గంలో 10 వేల ఇళ్లపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక రాయితీలు అందించి సోలార్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆయన వివరించారు. పెట్టుబడులకు ప్రాధాన్యం ఇచ్చి జగన్ పాలనలో తరలిపోయిన పెట్టుబడులను తిరిగి ఏపీకి రప్పిస్తున్నామని రవీంద్ర తెలిపారు. విశాఖలో ప్రధాని మోదీ చేతుల మీదుగా రూ.2లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుని పూర్తి చేసి సీమ ముఖ చిత్రాన్ని మార్చేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారని తెలిపారు. వరదల సమయంలో 3000 టీఎంసీల నీరు గోదావరి నుండి సముద్రంలో కలుస్తోందని, వాటిని ఒడిసిపట్టి రాష్ట్రాన్ని అభ్యున్నతి దిశగా నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రవీంద్ర చెప్పారు. 2 సంవత్సరాల్లో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేయబోతున్నామని రవీంద్ర చెప్పారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ రెడ్డి ఇప్పుడు శవ రాజకీయాలు చేస్తున్నాడని ఆయన మండిపడ్డారు. రాప్తాడులో జరిగిన చిన్న ఘటనను జగన్ ఉద్దేశ్యపూర్వకంగా రాజకీయం చేస్తున్నాడని తప్పుబట్టారు. పోలీసుల గుడ్డలు విప్పి కొడతామని పోలీసు వ్యవస్థను అవమానించారని, వ్యవస్థలను భయపెట్టేలా జగన్ కుట్రలకు పాల్పడుతున్నాడని మంత్రి రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి పెట్టుబడులు రాకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. "గుంటూరుకు చెందిన మాజీ మంత్రి.. గుంటూరు అటు ప్రజలు బయటకు రానివ్వం.. ఇటు తలలు లేకుండా చేస్తామని బీరాలు పలుకుతున్నాడు. పార్టీ క్రమ శిక్షణకు కట్టుబడి టీడీపీ నేతలు సంయమనం పాటిస్తున్నారనే విషయాన్ని జగన్ రెడ్డి, వారి దొంగల ముఠా గుర్తుంచుకోవాలి. రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా పాలన చేస్తున్నాం. మీలా అరాచకాలకు పాల్పడటం మాకు తెలియదు. అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా ఏపీని మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది" అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు, క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే రోల్ మోడల్ గా మంగళగిరి 100 పడకల ఆసుపత్రి
# 13న శంకుస్థాపన చేయనున్న లోకేష్

మంగళగిరి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మంగళగిరి ప్రజల 30 ఏళ్ల కల వంద పడకల ఆసుపత్రి నిర్మాణం. తనను 91వేల భారీ మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపడంతో మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కలను




నెరవేర్చేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సిద్ధమయ్యారు. అత్యాధునిక వసతులతో దేశానికే రోల్ మోడల్ గా ఆసుపత్రి నిలిచేలా ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ఈ నెల 13వ తేదీన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా, దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేష్ ఇప్పటికే అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవన నమూనాలు, ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాల కల్పన విషయంలో పలుమార్లు అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రశాంత వాతావరణంలో పని చేసేలా చూడాలన్నారు. ఏడాదిలోగా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలని గడువు విధించారు.

చినకాకాని వద్ద వంద పడకల ఆసుపత్రికి కేటాయించిన 7.35 ఎకరాల్లో 1,15,000 చదరపు అడుగుల్లో అత్యంత విశాలంగా ఆసుపత్రి భవనాన్ని నిర్మించనున్నారు. వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధికి రూ.52.20 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం జీ ప్లస్ వన్ విధానంలో ఆసుపత్రిని నిర్మిస్తుండగా భవిష్యత్ లో విస్తరించుకునే అవకాశం ఉంది. ఆసుపత్రిలో మెడికల్, సర్జికల్, ఆర్థో, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు 3 ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ సెంటర్, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు తలసేమియా వార్డు, డీ అడిక్షన్ ఓపీ సెంటర్ ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

యువగళం పాదయాత్రలో భాగంగా మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తానని నారా లోకేష్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతేడాది అక్టోబర్ 23వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ విషయాన్ని కేబినెట్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించడంతో మంగళగిరి ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది. తనకు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తో అంతగా కొట్లాడి మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకొస్తానని ఎన్నికల సమయంలో లోకేష్ పేర్కొన్నారు. అన్నట్లుగా రాష్ట్రంలోనే మూడో భారీ మెజార్టీ సాధించడంతో మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు.

1986లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ మంగళగిరిలో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించారు. కాలక్రమేణా ఆసుపత్రి నిరాదరణకు గురి కావడంతో కేవలం ఓపీ సేవలకు మాత్రమే పరిమితమైంది. అనేక సంవత్సరాలుగా మంగళగిరి ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచాలంటూ ప్రజలు ప్రత్యేక కమిటీలుగా ఏర్పడి డిమాండ్ చేస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ఎంతో మంది పాలకులకు వినతి పత్రాలు సమర్పించారు. అయినా ఫలితం లేదు. మంత్రి లోకేష్ రాకతో ఆసుపత్రి కల సాకారం కానుంది. మంగళగిరిలో ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి భవనం శిథిలం కావడం, ఇతర ఇబ్బందుల నేపథ్యంలో ప్రభుత్వ వైద్యశాలను చినకాకానికి మార్చి వైవీసీ క్యాన్సర్ ఆసుపత్రి స్థలాన్ని కేటాయించారు. దేశంలోనే మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దేందుకు మంత్రి లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలకు మొదటి విడతలో మూడువేల మందికి శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తున్నారు. బహిరంగ మార్కెట్ లో రూ.వెయ్యికోట్ల ఆస్తిపై శాశ్వత హక్కు కల్పిస్తున్నారు. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వాటర్ పైప్ లైన్, భూగర్భ గ్యాస్, భూగర్భ కరెంట్ అందించేందుకు త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. వీటితో పాటు చెరువులు, పార్క్ లు అభివృద్ధి చేయనున్నారు. కళ్యాణ మండపాలు, కమ్యూనిటీ భవనాలు నిర్మించనున్నారు. ఎన్నికలకు ముందే మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 26 అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నారా లోకేష్ ప్రజల మనస్సు గెలుచుకున్నారు.





# హోమియో వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి
## బడేటి చంటి

ఏలూరు ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

హోమియో వైద్యసేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. ఏలూరు ఆర్ఆర్ పేటలోని పార్క్ వద్ద గురువారం నిర్వహించిన హోమియో వైద్య సృష్టికర్త డాక్టర్ సిఎఫ్ శామ్యూల్ హానిమన్ 207వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలుత ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కెఎస్ఎస్ శివమూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చంటికి ఘన స్వాగతం లభించింది. అనంతరం డాక్టర్ హానిమన్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ హోమియో వైద్యసేవల్ని ప్రజలచెంతకు చేర్చేందుకు సంస్థ చేస్తోన్న కృషిని ప్రశంసించారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్ధసారధి, డిప్యూటి మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, 33వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జ్ పి. సంధ్యా శ్రీలక్ష్మి, టిడిపి నాయకులు ఆరెపల్లి తిరుపతిరావు, ఐఐహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వికె పంకజాక్షన్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్‌పి భాస్కరాచార్యులు, డాక్టర్ కూరపాటి శ్రీనివాస్, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ అబ్బూరి అరుణ, డాక్టర్ బండారు సుదీప్తి తదితరులు పాల్గొన్నారు.



## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు
## కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుభాకాంక్షలు.

ఏలూరు ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు కేంద్ర హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంత్రి అమిత్ షా గురువారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీ మహేష్ కుమార్ కు కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా స్వయంగా ఫోన్ చేసి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షాకు ఎంపీ మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# రైతు కూలీగా మారి..
## ధాన్యాన్ని జల్లెడ పట్టిన మెదక్ జిల్లా కలెక్టర్

**పాతూరు గ్రామంలో ఐకేపీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్**

**కేంద్రంలో వివిధ పనులు చేసిన కలెక్టర్ సహా అధికారులు**

**రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచన**





మెదక్ ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కొద్దిసేపు రైతు కూలీగా మారి అందరి దృష్టిని ఆకర్షించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో జల్లెడ పట్టి తన ప్రత్యేకతను చాటుకున్నారు. అదనపు కలెక్టర్ నగేశ్‌తో కలిసి ఆయన మెదక్ మండలం పాతూరు గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా, కలెక్టర్‌తో పాటు వచ్చిన అధికారులు కేంద్రంలో కొద్దిసేపు వివిధ పనులు చేశారు. కలెక్టర్ స్వయంగా ధాన్యాన్ని జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని కేంద్రాలలో ప్యాడీ క్లీనర్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతులు ధాన్యం విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఇదిలా ఉండగా, గతంలో ఆయన ఔరంగబాద్ గ్రామంలో వరి నాట్లు వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు.

# ఏపీ మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష తేదీ మార్పు.. కారణం ఇదే!



అమరావతి ఏప్రిల్ 10 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**రాష్ట్రంలోని 164 ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష తేదీలో మార్పు చోటుచేసుకుంది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్ష ఏప్రిల్ 20న (ఆదివారం) జరగాల్సి ఉండగా.. ఈస్టర్ పర్వదినం నేపథ్యంలో ఏప్రిల్ 21(సోమవారం)కి రీషెడ్యూల్ చేసినట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ మార్పును గమనించాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏ మండలంలో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయో.. అక్కడే ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే పరీక్షకు హాజరు కావాలని సూచించారు.**

హాల్‌టికెట్లు అందుబాటులోకి వచ్చాక విద్యార్థులు www.cse.ap.gov.in లేదా www.apms.apcfss.in వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఫిబ్రవరి 24 నుంచి మార్చి 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. మరోవైపు, ఇంటర్‌లో ప్రవేశాలకు ఇప్పటికే మొదలైన దరఖాస్తుల ప్రక్రియ మే 22వరకు కొనసాగనుంది.

# 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్

## 6 జట్లు.. అమెరికా ఫిక్స్..!

విశ్వ క్రీడా సంబరం ఒలింపిక్స్‌లో శతాబ్దకాలం తర్వాత క్రికెట్‌కు మళ్లీ చోటు దక్కిన సంగతి తెలిసిందే. దాదాపు 128 ఏళ్ల తర్వాత 2028లో జరగబోయే లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ భాగం కానుంది. ఈ పోటీల నిర్వహణ కోసం ఇప్పటికే కసరత్తు మొదలైంది. కాగా.. ఇందులో ఆరు జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తాజాగా నిర్ణయించారు. ఆతిథ్య దేశమైన అమెరికాకు డైరెక్ట్ ఎంట్రీ దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



పురుషులు, మహిళల విభాగాల్లో ఆరేసి జట్లతో టీ20 ఫార్మాట్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారట. క్వాలిఫికేషన్ ప్రక్రియను ఇంకా నిర్ణయించలేదు. అయితే, ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న అమెరికాకు తప్పకుండా పోటీల్లో స్థానం ఖరారవుతుందని అంచనాలు వెలువడుతున్నాయి. మిగతా ఐదు జట్ల కోసం ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. టెస్టులు, వన్డేల్లా కాకుండా.. టీ20 ఫార్మాట్‌లో దాదాపు 100 దేశాలు క్రికెట్ ఆడుతున్నాయి. వీటిలో నుంచి తుది జట్లను ఎంపిక చేయడం సవాల్‌తో కూడుకున్నదే అని నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.

లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ (2028 %ాశీం ాఅస్త్రవశ్రీవం ఉశ్రీఎఎజూఅఎం%) కోసం ఈవెంట్ ప్రోగ్రామ్‌ను.. అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ ఎగ్జిక్యూటివ్ బోర్డు బుధవారం ఆమోదించింది. ఈ సమావేశంలోనే క్రికెట్‌లో ఆరు జట్లపై నిర్ణయం తీసుకున్నట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈసారి మొత్తం 351 మెడల్ ఈవెంట్లు నిర్వహించాలని నిర్ణయించారు. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌తో పాటు బేస్‌బాల్– సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లక్రాస్ (సిక్సస్), స్క్వాష్‌కు కూడా అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే.


### 1900.. అదే మొదలు.. చివర..

1900 ఒలింపిక్స్‌లో క్రికెట్ నిర్వహించారు. అదే తొలిసారి, చివరిసారి కూడా. అప్పుడు డెవాన్ అండ్ సోమర్‌సెట్ వందరర్స్ క్లబ్ (బ్రిటన్), ఫ్రెంచ్ అథ్లెటిక్ క్లబ్ యూనియన్ (ఫ్రాన్స్) మధ్య రెండు రోజుల మ్యాచ్ జరిగింది. అయితే ఈ మ్యాచ్‌లో ఒక్క జాతీయ ఆటగాడూ లేడు. ఈ మ్యాచ్‌లో జట్టుకు 12 మంది చొప్పున ఆటగాళు ఆడటంతో దీనికి ఫస్ట్‌క్లాస్ హోదా కూడా దక్కలేదు. తొలి ఇన్నింగ్స్‌లో బ్రిటన్ 117 పరుగులు చేయగా.. ఫ్రాన్స్ 78 పరుగులకే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌ను 145/5 వద్ద బ్రిటన్ డిక్లేర్ చేసింది. ఛేదనలో ఫ్రాన్స్ 26 పరుగులకే కుప్పకూలడంతో బ్రిటన్ 158 పరుగుల తేడాతో నెగ్గింది. అప్పుడు బ్రిటన్‌కు రజతం, ఫ్రాన్స్‌కు కాంస్యం అందించారు. ఆ తర్వాత వీటిని పసిడి, రజత పతకాలుగా మార్చారు. ఆ తర్వాత పలు కారణాలతో క్రికెట్‌ను ఒలింపిక్స్ పోటీల నుంచి పక్కనబెట్టారు.

# ఇన్‌స్టాలో కోహ్లీ సర్‌ప్రైజ్..

## ఆ వీడియోలన్నీ తొలగింపు..!

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి బయటే కాదు.. సోషల్ మీడియాలోనూ విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అతడి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 27.1 కోట్ల మంది, 'ఎక్స్' ఖాతాకు 6.7 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. అందుకే టాప్ బ్రాండ్లన్నీ అతడితో ప్రచారం చేయించేందుకు పోటీపడుతుంటాయి. అలాంటి వీడియోలను కోహ్లీ కూడా తన సోషల్ మీడియాలోనూ పోస్ట్ చేస్తుంటాడు. ఇప్పటివరకు తన ఫీడ్‌లో అలాంటి పోస్ట్‌లే ఎక్కువగా కన్పించేవి. అయితే, తాజాగా ఇన్‌స్టాలో అతడు అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చాడు. యాడ్ కంటెంట్‌ను 'పోస్ట్' ఫీడ్ నుంచి తొలగించాడు.



ఇందుకు గల కారణం ఏంటో తెలియదు గానీ.. ప్రస్తుతం అతడి ఇన్‌స్టా ఖాతా తెరవగానే వ్యక్తిగత అంశాలకు సంబంధించిన విషయాలే కన్పిస్తున్నాయి. క్రికెట్ విశేషాలు, జిమ్‌లో కసరత్తులు, భార్య అనుష్క శర్మ, కుటుంబంతో దిగిన ఫొటోలు, వీడియోలతో పాటు తన వ్యక్తిగత వ్యాపారాలకు సంబంధించిన పోస్టులు మాత్రమే దర్శనమిస్తున్నాయి.

### బ్యాటింగ్‌లో అహానికి పోను: కోహ్లీ

అయితే, తాను ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న యాడ్ వీడియోలను కోహ్లీ పూర్తిగా ఖాతా నుంచి తొలగించలేదు. వాటన్నింటినీ 'రీల్స్' సెక్షన్‌లోకి మార్చారు. ఇప్పుడా వీడియోలన్నీ రీల్స్‌లో కనబడుతున్నాయి. ఇందుకు గల కారణాన్ని కోహ్లీ టీమ్ ఇంకా వెల్లడించలేదు. అయితే, ఈ మార్పుపై అభిమానుల నుంచి భిన్న స్పందనలు వస్తున్నాయి. యాడ్స్ లేకపోవడం చాలా బాగుందని కొందరు చెబుతుండగా.. స్పాన్సర్స్ డీల్స్‌ను బ్రేక్ చేసుకున్నాడా? అని కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఇది నెట్టింట చర్చనీయాంశంగా మారింది.

ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌ల్లో బిజీగా ఉన్న కోహ్లీ.. ఇటీవలే మరో భారీ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. టీ20 క్రికెట్‌లో 13,000 పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. ఐపీఎల్ (%ఖూా%) 18 సీజన్‌లో భాగంగా ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగిన మ్యాచ్‌లో విరాట్ ఈ ఫీట్ సాధించాడు. 386 ఇన్నింగ్స్‌ల్లో కోహ్లీ 13,000 పరుగుల మైలురాయి అందుకున్నాడు. అతడి కంటే ముందు నలుగురు క్రికెటర్లు టీ20ల్లో 13 వేల రన్స్ పూర్తి చేశారు.

# బ్యాటింగ్‌లో అహానికి పోను

పరిస్థితులకు తగినట్లు బ్యాటింగ్ చేయాలనుకుంటానని, అహానికి పోనని భారత బ్యాటింగ్ స్టార్ విరాట్ కోహ్లీ అన్నాడు. ఆధునిక క్రికెట్లో అత్యంత విజయవంతమైన క్రికెటర్లలో ఒకడైన విరాట్.. టీ20 క్రికెట్లో 13 వేల పరుగుల మైలురాయిని అందుకున్న భారత తొలి బ్యాటర్‌గా ఇటీవలే ఘనత సాధించాడు. "బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఎప్పుడూ అహానికి పోను. ఎప్పుడూ ఒకరిని అధిగమించాలని చూడను. ఎల్లప్పుడూ మ్యాచ్ పరిస్థితులకు తగినట్లు అర్థం చేసుకుని, అందుకు తగినట్లు ఆడతా. అందుకు నేను గర్విస్తా. పరిస్థితులు డిమాండ్ చేసినట్లు ఆడతా" అని కోహ్లీ అన్నాడు. "నేను మంచి లయలో ఉంటే సహజంగానే ధాటిగా ఆడేందుకు ప్రయత్నిస్తా. ఇంకెవరైనా దూకుడుగా ఆడుతున్నట్లయితే.. వారికి మద్దతిస్తా" అని చెప్పాడు. "రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తొలి మూడేళ్లలో టాప్ ఆర్డర్‌లో నాకు పెద్దగా అవకాశాలు దక్కలేదు. బ్యాటింగ్ ఆర్డర్‌లో దిగువన వచ్చేవాణ్ని. దాంతో పెద్దగా ఏమీ చేయలేకపోయా. కానీ 2010 నుంచి నిలకడగా ప్రదర్శన చేయడం మొదలెట్టా. 2011 నాటికి నేను రెగ్యులర్ నంబర్.3 గా మారిపోయా. సరిగ్గా అప్పుడే నా ఐపీఎల్ ప్రయాణం ఓ రూపు సంతరించుకోవడం మొదలైంది" అని కోహ్లీ అన్నాడు. ఐపీఎల్‌లో 256 మ్యాచ్‌ల్లో కోహ్లీ 8 సెంచరీలు సహా 8168 పరుగులు సాధించాడు. ఈ లీగ్‌లో అత్యధిక పరుగుల రికార్డు అతడిదే.



## పృథ్వీషాను గుర్తుచేసుకో..

# ఆటపై దృష్టిపెట్టు

### జైస్వాల్‌కు మాజీ క్రికెటర్ సూచన



రెండేళ్ల క్రితం తన అదిరే ఆటతీరుతో అందరినీ ఆశ్చర్యపరిచిన టీమ్‌ఇండియా యువ కెరటం యశస్వి జైస్వాల్ ప్రస్తుతం ఫామ్‌లో కనిపించడం లేదు. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్- గవాస్కర్ ట్రోఫీలో 3-1 తేడాతో భారత్ సిరీస్ ఓడిపోయిన తర్వాత నుంచి జైస్వాల్ పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్నాడు. తాజాగా ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ యువ బ్యాటర్.. పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 67 పరుగులు మినహా మిగతా మ్యాచ్‌లో పెద్ద స్కోర్లు చేయడంలో విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలోనే పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ స్పందిస్తూ.. జైస్వాల్‌కు కీలక సూచనలు చేశాడు.

"యశస్వి జైస్వాల్ క్రికెట్ మీద సరిగా ఫోకస్ చేయడం లేదు. ఇదే కొనసాగితే భవిష్యత్తులో బాధపడాల్సి వస్తుంది. పృథ్వీషానే దీనికి చక్కటి ఉదాహరణ. జైస్వాల్ పరిస్థితి చేయి దాటకముందే క్రికెట్‌ను ప్రేమించు. తిరిగి ఫామ్ అందుకో" అని బాసిత్ అలీ తన యూట్యూబ్ ఛానల్‌లో హెచ్చరించాడు. అలాగే అంతర్జాతీయ టీ20ల నుంచి రోహిత్, కోహ్లీ రిటైర్‌మెంట్ గురించి కూడా బాసిత్ అలీ మాట్లాడాడు. "టీ20 వరల్డ్ కప్ 2024ను భారత్ సొంతం చేసుకున్న తర్వాత విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించారు. ఇది మంచి నిర్ణయం. భారత్‌లో టాలెంట్ ఉన్న యువ క్రీడాకారులకు కొదవ లేదు. ఎప్పటికప్పుడు టీమ్ ఇండియా వారితో భర్తీ అవుతుంది. నిజానికి కోహ్లీ అంత తొందరగా టీ20లకు వీడ్కోలు పలుకుతాడని అనుకోలేదు" అని వ్యాఖ్యానించాడు.

# నేను ఎప్పుడూ ధోనీ ఫ్యాన్‌నే

## అంబటి రాయుడు



టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ఎంఎస్ ధోనిని ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలపై పలు విమర్శలు వచ్చాయి. వాటిని అతడు ఖండించాడు. తాను ఎప్పటికీ ధోనీకి అభిమాని అని స్పష్టం చేశాడు. మంగళవారం ముల్లాన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో మ్యాచ్‌కు ముందు హిందీ కామెంట్రీలో రాయుడు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ధోనీని చేతిలో కత్తి పట్టుకున్న యుద్ధ వీరుడితో పోల్చిన తర్వాత కొంతమంది అభిమానులు అతని వ్యాఖ్యలు కాస్త అతిగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. కాగా రాయుడు ఆ విమర్శలకు సమాధానం ఇచ్చాడు.

మ్యాచ్‌లో భాగంగా ధోనీ బ్యాటుతో క్రీజులోకి వస్తున్నప్పుడు... 'ఐసా లగ్‌రహా హై తల్వార్ లేఖర్ ఆ రహేహై ధోనీ. బిల్‌కుల్ చలేగా తల్వార్ ఆజ్.. ధోనీ తల్వార్ చలేగా..' (ధోనీ ఖడ్గాన్ని పట్టుకుని వస్తున్నట్లు ఉంది. ఆ ఖడ్గం కచ్చితంగా ఫలితం సాధిస్తుంది. ధోనీ ఖడ్గం కచ్చితంగా విజయం సాధిస్తుంది) అని అంబటి రాయుడు, నవజ్యోత్ సింగ్ సిద్ధూతో మైక్ పంచుకుంటూ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'ధోనీ క్రికెట్ ఖేల్‌నే ఆయా హై గురూ. యుద్ధ్ లడ్‌నే నహీ!' (ధోనీ క్రికెట్ ఆడటానికి వచ్చాడు. యుద్ధంలో పాల్గొనడానికి కాదు) అని సిద్ధు ఎక్స్ ఖాతాలో అంబటి రాయుడును ఉద్దేశిస్తూ రాశాడు. పలువురు క్రికెట్ అభిమానులు కూడా అంబటి రాయుడును దుయ్యబట్టారు. ధోనీని మరీ ఎక్కువగా పొగిడేస్తున్నాడు అంటూ.. సోషల్ మీడియాలో అతణ్ని ట్రోల్ చేశారు. 'నేను తలా ఫ్యాన్‌ను. ఎప్పటికీ తలా ఫ్యాన్‌నే. ఎవరు ఏం అనుకున్నా.. ఏం చేసుకున్నా ఫర్వాలేదు. దాని వల్ల ఒక్క శాతం కూడా తేడా ఉండదు. కాబట్టి దయచేసి పెయిడ్ ప్రమోషన్లపై డబ్బు ఖర్చు చేయడం మానేసి, ఆ ధనాన్ని దాతృత్వం కోసం వెచ్చించండి. చాలా మంది పేదలు ప్రయోజనం పొందుతారు' అని అంబటి రాయుడు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు. మంగళవారం పంజాబ్‌కింగ్స్‌తో, చెన్నై సూపర్ కింగ్స్‌కు జరిగిన మ్యాచ్లో ధోనీ అయిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆ సమయంలో చెన్నై విజయానికి 25 బంతుల్లో 69 పరుగులు కావాల్సిన పరిస్థితి. ఆ సమయంలో ధోనీ కేవలం 12 బంతుల్లోనే 27 పరుగులు చేశాడు. ఇందులో మూడు సిక్స్‌లు, ఒక ఫోర్ ఉన్నాయి. అయినప్పటికీ చెన్నై సూపర్ కింగ్స్ ఈ మ్యాచ్‌లో 18 పరుగులతో ఓడిపోయిన సంగతి తెలిసిందే.




# ప్రదీప్ కొత్త సినిమా లాంచ్ చేసిన రామ్ చరణ్

ప్రముఖ యాంకర్, నటుడు ప్రదీప్ మాచిరాజు హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ సినిమా బిగ్ టికెట్‌ను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం చిత్ర బృందానికి ప్రత్యేకంగా మైలురాయిగా నిలిచింది. ఈ బిగ్ టికెట్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో ఎంతో హంగుగా జరిగింది. రామ్ చరణ్ వస్తారన్న సమాచారం తెలిసిన దగ్గర నుంచే అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. అభిమానులు పెద్ద ఎత్తున హాజరై మెగా హీరోను చూసి ఉత్సాహభరితంగా స్పందించారు. ఈ సందర్భంగా చిత్ర బృందం మాట్లాడుతూ %-% ఇంతటి బడా హీరో చేత బిగ్ టికెట్ ఆవిష్కరణ జరగడం గర్వంగా ఉంది. రామ్ చరణ్ గారు మంచి మనసుతో మాతో పాల్గొనడం చిత్రానికి పెద్ద ప్రోత్సాహంగా నిలిచింది, అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఏప్రిల్ 11న విడుదలవుతుంది. ఫన్, రొమాన్స్, కుటుంబ విలువల మేళవింపుతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ప్రదీప్ మాచిరాజు ఇందులో హీరోగా కనిపించనుండటంతో, టీవీ ఆడియెన్స్ నుంచీ సినిమాఫ్యాన్స్ వరకూ క్యూరియాసిటీ పెరిగింది. ప్రదీప్ మాట్లాడుతూ %-% చరణ్ గారి సపోర్ట్‌కి కృతజ్ఞతలు. నా తొలి అడుగులు వేస్తున్న ఈ సినిమాకు అతని చేతుల మీదుగా టికెట్ రిలీజ్ కావడం ప్రత్యేకంగా భావిస్తున్నా ఇది నాకు ఒక ఎమోషనల్ మూమెంట్, అని ఆనందాన్ని వ్యక్తం చేశారు.







# 'జాక్'తో ప్రేక్షకుల ముందుకు జొన్నలగడ్డ

టాలీవుడ్ యువ హీరో సిద్దు జొన్నలగడ్డ ప్రస్తుతం తన తాజా చిత్రం 'జాక్' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. కొంచెం క్రాక్ అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్.ఈరోజు థియేటర్లలో విడుదల అయ్యింది. రొమాంటిక్, కామెడీ, యాక్షన్ కలిపి ఈ చిత్రం తెరకెక్కించారని తెలుస్తోంది.ఈ చిత్రంలో వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే టిల్లు, టిల్లు స్క్వేర్ సినిమాలతో హిట్ ట్రాక్‌లో ఉన్న సిద్దు, ఈ సినిమాతో మరోసారి సక్సెస్ అందుకునే ఛాన్స్ ఉంది. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తన ఎస్‌వీసీసీ బ్యానర్‌పై నిర్మించారు.ఇప్పటికే ఈ సినిమా శరవేగంగా షుటింగ్ పూర్తి చేసుకుంది.టెర్రరిస్ట్ కాన్సెప్ట్‌ను ఈ కథలోకి ఎలా జొప్పించారు? ఆ ట్రాక్‌తో ఉన్న లింక్ ఏంటన్నది సినిమా చూస్తేనే అర్థం అవుతుంది. ఇక వైష్ణవి చైతన్య పాత్రకి చాలా ప్రాధాన్యత ఉందన్నట్టుగా కనిపిస్తోంది.నరేష్ కామెడీ, సిద్దు టైమింగ్, శ్యామ్ సీఎస్ ఆర్ఆర్, అచ్చు రాజమణి పాటలు సినిమాకు ప్లస్ అయ్యేలా ఉన్నాయి. ఇక చాలా రోజుల తరువాత ప్రకాష్ రాజ్‌కు మంచి పాత్ర దక్కినట్టుగా అనిపిస్తుంది. మరి ఈ జాక్ చిత్రం అయితే న్యూ ఏజ్ కంటెంట్, మేకింగ్‌లానే కనిపిస్తుంది. బొమ్మరిల్లు భాస్కర్ ఈ సారి ఎక్కువగా హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను నమ్ముకున్నాడని తెలుస్తోంది. బొమ్మరిల్లు భాస్కర్ చాలా గ్యాప్ తీసుకుని ఈ జాక్ సినిమాను తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మోస్ట్ ఎలిజబుల్ బ్యాచ్‌లర్ తరువాత బొమ్మరిల్లు భాస్కర్ చాలా టైం తీసుకున్నాడు. ఇక మళ్లీ జాక్ సినిమాతో బొమ్మరిల్లు భాస్కర్ ఖాతాలో హిట్ పడుతుందా? ఫ్లాప్ పడుతుందా? అన్నది చూడాలి.అసలే సిద్దు మంచి ఫాంలో ఉన్నాడు. టిల్లు, టిల్లు స్క్వేర్ తరువాత వస్తున్న సినిమా కావడంతో మంచి బజ్ అయితే ఉందన్న సంగతి తెలిసిందే.కంటెంట్ పరంగా జాక్ లో వైవిధ్యం కనిపిస్తోంది.సిద్దు మార్కు కామెడీ టైమింగ్ ని వాడుకుంటూనే యాక్షన్, ఫన్ రెండింటిని దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ బ్యాలన్స్ చేసిన తీరు ఆసక్తి గొలిపేలా ఉంది. ట్రైలర్ చివర్లో రొమాన్స్ గురించి సిద్దు చెప్పే డైలాగులు, నాన్నగా నటించిన నరేష్ తో పండించిన హాస్యం యూత్ ని టార్గెట్ చేసుకున్నాయి. సామ్ సిఎస్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించగా అచ్చురాజమణి పాటలు ఆల్రెడీ జనాల్లోకి వెళ్లిపోయాయి. కొంచెం క్రాక్ క్యాప్షన్ పెట్టుకుని వస్తున్న జాక్ అంచనాలు రేపడంలో సక్సెసయ్యాడు.

**నెటిజన్ ట్వీట్**

ఉదయం నుంచి ఈ సినిమాకు మిశ్రమ స్పందన వస్తుంది. ఫ్యామిలీ, లవ్ స్టోరీ సినిమాల దర్శకుడిగా ముద్రపడిన బొమ్మరిల్లు భాస్కర్ ఈసారి తన జానర్ మార్చి జాక్ మూవీని తెరకెక్కించాడు.ఠి ఈ ముగ్గురి కాంబోలో వచ్చిన జాక్‌పై నెటిజన్లు ఏమంటున్నారో ఓ లుక్కేస్తే,జాక్ కథను అలా సగం వండి వదిలేసినట్టుగా ఉంది, అసలు ఏ చోట కూడా కనెక్టివిటీ ఉండదనిపిస్తుంది రా ని రాయల్‌గా చూపించాలి ఇలా రోతలా కాదు ప్రతీ సారి వన్ లైనర్ పంచులతో సినిమా వర్కౌట్ అవ్వదు అని ఇంకా ఎప్పటికీ అర్థం అవుతుందో ఏమో ఇంత చెప్పినాక కూడా థియేటర్లో సినిమా చూస్తా అంటే మీ ఇష్టం అంటూ ఓ నెటిజన్ ఘాటుగా ట్వీట్ చేశాడు.కొందరేమో ఫస్ట్ హాఫ్ పర్లేదు అని చెబుతున్నారు కొన్ని చోట్ల సిద్దు కామెడీ వర్కౌట్ అయిందని అంటున్నారు బొమ్మరిల్లు భాస్కర్ ఇందులో ప్రతీ ఒక్క ఎమోషన్‌ను వాడుకుని చూపించారని, కాకపోతే అవేవీ కనెక్ట్ కావు అని చెబుతున్నారు. సెకండాఫ్ తేడా కొట్టేసిందని అంటున్నారు. జాక్ అనేది ఓ స్పై కామెడీ యాక్షన్ మూవీ అని.. అందులో స్పై మూమెంట్స్ కానీ కామెడీ కానీ వర్కౌట్ కాలేదని అంటున్నారు.. అన్ని కమర్షియల్ అంశాల్ని పొందుపర్చి సినిమాను తీయాలని అనుకున్నాడు బొమ్మరిల్లు భాస్కర్‌ఏ ఒక్క సీన్ కూడా ఇంపాక్ట్ క్రియేట్ చేయదు గందరగోళంగా నడిచే స్క్రీన్ ప్లే వీక్ రైటింగ్‌తో బోరింగ్ అనిపిస్తుందట.




# 'విశ్వంభర' నుంచి మెగా అప్‌డేట్.. ఫస్ట్ సింగిల్ రిలీజ్ డేట్ ఫిక్స్!

**చిరంజీవి, వశిష్ట కాంబోలో 'విశ్వంభర' ఏప్రిల్ 12న 'రామ రామ' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటన**

మెగాస్టార్ చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'విశ్వంభర'. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్‌ను ఏప్రిల్ 12న విడుదల చేయనున్నట్లు చిత్రం యూనిట్ ప్రకటించింది. 'రామ రామ' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా బాల హనుమాన్‌లతో చిరు ఉన్న కొత్త పోస్టర్‌ను మేకర్స్ పంచుకున్నారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు విజేత ఎంఎం కీరవాణి బాణీలు అందిస్తున్నారు. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. ఇక గతేడాది దసరా కానుకగా 'విశ్వంభర' టీజర్ విడుదల కాగా... మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. త్వరలో విడుదల తేదీని కూడా ప్రకటిస్తారని సమాచారం.

# ఓటీటీలోకి 'ఛావా'..

ఛావా అనే చిత్రం బాలీవుడ్, టాలీవుడ్ ప్రేక్షకుల మన్నింపును సాధించిన ఒక సూపర్ హిట్ చిత్రంగా నిలిచింది. విక్కీ కౌశల్, రష్మిక మందన్నా జంటగా నటించిన ఈ చిత్రం మహారాష్ట్ర యోధుడు, గౌరవప్రదమైన చరిత్రాత్మక వ్యక్తిత్వం, శంభాజీ మహారాజ్ యొక్క జీవితాన్ని ఆధారంగా రూపొందించబడింది. ఇది బాలీవుడ్‌లో 2025లో విడుదలైన అద్భుతమైన చరిత్రాత్మక యాక్షన్ డ్రామాగా నిలిచింది. ఈ చిత్రాన్ని లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కించారు, మడాక్ ఫిల్మ్స్ పతాకంపై దినేశ్ విజన్ నిర్మించారు. ఈ చిత్రంలో శంభాజీ మహారాజ్ పాత్రను విక్కీ కౌశల్ పోషించారు, మరియు రష్మిక మందన్నా శంభాజీ మహారాజ్ జీవితంలో ఉన్న ప్రియమైన వ్యక్తిగా నటించారు. ఇది శంభాజీ మహారాజ్ యోధగీతాలు, పోరాటాలు, కుటుంబ సంబంధాలు, నాయకత్వ లక్షణాలు మరియు అతని పరాక్రమాలు తెలియజేస్తుంది. ఈ చిత్రం ప్రేక్షకులను ఓ చరిత్రాత్మక యాత్రలో తీసుకెళ్ళినట్లయింది. 2025 ఫిబ్రవరి 14న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి ఆహ్లాదకరమైన స్పందనను పొందింది. సూపర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లను సాధించింది. బాలీవుడ్‌లో రికార్డు స్థాయి రూ. 800 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించడం విశేషం. ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకున్న కారణాలు విభిన్నం. వీటిలో నటన, దృశ్యచిత్రణ, సంగీతం, మరియు అనుభవపూర్వక కథా గమనం ఉన్నాయి.

**తెలుగులో ప్రేక్షకులముందుకు:**

ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ అనే ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థ తెలుగులో మార్చి 7న విడుదల చేసింది. తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ సినిమా మంచి సుదీర్ఘ విజయాన్ని అందించింది. విజయవంతంగా వసూలైన తెలుగులోని ఆదరణ, ఈ సినిమాను ఓటీటీలోకి తీసుకురావడంలో కీలకమైన క్షణంగా మారింది.

**ఓటీటీ విడుదల:**

ఇప్పుడు, ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై స్ట్రీమింగ్ కోసం సిద్ధమైంది. 2025 ఏప్రిల్ 11న ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది. ఇది సినిమా అభిమానుల కోసం మరొక కొత్త ముద్రగా మారింది. నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలకు ముందే, ఈ చిత్రం గురించి సునామీలా అంచనాలు పెరిగాయి. ఈ సందర్భంగా, నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో శంభాజీ మహారాజ్ పాత్రలో విక్కీ కౌశల్ పటిష్టంగా, శక్తివంతంగా కనిపిస్తూ, ఆకట్టుకుంటుంది. విక్కీ కౌశల్ మరియు రష్మిక మందన్నాఈ ఇద్దరు స్టార్ నటులు ఈ చిత్రంలో గొప్ప అంగీకారం పొందారు. విక్కీ కౌశల్ శంభాజీ మహారాజ్ పాత్రలో తన ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు.







# శ్రీవారి సన్నిధిలో అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి మూవీ టీమ్

టాలీవుడ్ యాక్టర్ కళ్యాణ్ రామ్ ప్రస్తుతం నటిస్తున్న తాజా చిత్రం "అర్జున్ %నా/శీ% వైజయంతి" సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రంలో కళ్యాణ్ రామ్ మాస్ యాక్షన్ డ్రామాలో తన నటనతో ఆకట్టుకోబోతున్నారు.ప్రదీప్ చిలుకూరి డైరెక్ట్ చేస్తున్న ఈ మాస్ యాక్షన్ డ్రామాలో సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తోంది. లేడీ సూపర్ స్టార్ విజయశాంతి కీలక పాత్ర పోషిస్తోంది. కాగా ఈ చిత్రం వచ్చే వారం (ఏప్రిల్ 18) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో కళ్యాణ్ రామ్, విజయశాంతి అండ్ టీం ఇవాళ తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. 10 సంవత్సరాల నా కెరీర్ లో ఇలాంటి ఎన్నో ఆపరేషన్స్ కానీ చావుకు ఎదురెళ్తున్న ప్రతీసారి నా కళ్ల ముందు కనిపించే ముఖం నా కొడుకు అర్జున్ అంటూ విజయశాంతి వాయిస్ ఓవర్ తో ఈ టీజర్ మొదలైంది. విజయశాంతి వైజయంతి అనే పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా కనిపించగా ఆమె కొడుకు పాత్రలో కళ్యాణ్ రామ్ కనిపించాడు. నెక్స్ట్ బర్త్ డే నాటికి పోలీస్ గా ఖాకీ డ్రెస్ లో చూడాలని వైజయంతి తన కొడుకుని కోరుతుంది. కాని లాఠీ చేతపట్టాల్సిన అర్జున్ కొన్ని అనుకోని పరిస్థితుల్లో కత్తి పట్టుకొని రౌడీల మీద యుద్ధానికి బయలుదేరినట్లు టీజర్ లో చూపించారు.టీజర్‌లో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఎలివేట్ అయ్యేలా కట్ చేశారు. అయితే హీరోయిన్ ను పూర్తిగా సైడ్ చేశారు. విజయశాంతి చెప్పిన డైలాగ్స్ చూస్తే ఆమెకి కొడుకు అంటే ఎంత ఇష్టమో అర్థమవుతుంది. తల్లీ కొడుకుల మధ్య ప్రేమ, వైరం, ఎమోషన్స్, సెంటిమెంట్ నేపథ్యంలో చిత్రాన్ని తెరకెక్కించినట్టు



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339